2,793 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ పంటకాలానికి సంబంధించి ఈనెల 8వ తేదీ వరకు జిల్లాలో రూ.6.44 కోట్ల విలువైన 2793.680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు ధాత్రిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 333 మంది రైతుల వద్ద నుంచి 39 రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి సమీపంలోని రైస్ మిల్లుకు తరలించినట్టు ఆమె వివరించారు.

మోకాళ్ల నొప్పులు తగ్గిస్తానంటూ..



స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ వాడుతున్న నకిలీ డాక్టర్.. స్పెషలిస్టు పేరిట ఏడాదిన్నరగా వైద్యం.. అధికారుల తనిఖీలు

పెనుగొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 'మీకు మోకాళ్ల నొప్పులా..? ఎన్నో ఏళ్లుగా బాధిస్తున్నాయా ? ఆపరేషన్ చేయాలని చెబుతున్నారా ? మీరేం దిగులు చెందకండి. మా వద్దకు వస్తే రోజుల వ్యవధిలో తగ్గిస్తాం' అంటూ ఓ నకిలీ వైద్యుడు భారీ ఎత్తున స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ వాడుతున్న వైనం శనివారం బట్టబయలైంది. పెనుగొండ మండలం సోమరాజు చెరువులో కె.కృష్ణతేజ కొన్నేళ్లుగా తేజ మెడికల్స్ అండ్ జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్నాడు. ఆయన మోకాళ్ల నొప్పులు తగ్గిస్తానంటూ ప్రచారం చేసుకోవడంతో పెద్ద సంఖ్యలో వైద్యం కోసం పెద్ద ఎత్తున వస్తున్నారు. వచ్చిన వారికి స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ ఇస్తూ నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తున్నారు. దీంతో ఆ నోటా, ఈ నోటా ఆపరేషన్ లేకుండా నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుందని ప్రచారం జరిగింది. ఆయన వైద్యంపై అనుమానం వచ్చిన కొందరు ఆరా తీశారు. వైద్య విద్యకు సంబంధించి ఎలాంటి సర్టిఫికెట్లు లేవని తేలడంతో.. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు పెనుగొండ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ వినోద్‌కుమార్ శనివారం మందుల షాపును, ఆసుపత్రిని తనిఖీ చేశారు. అధికంగా స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ ఉన్నట్లు గుర్తించి వాటికి తాళాలు వేశారు. పూర్తి నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తానని విలేకరులకు తెలిపారు. స్టెరాయిడ్స్ వాడకంపై వైద్యాధికారులకు కొందరు గతంలోనే ఫిర్యాదుచేశారు. కాని, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని వెనుక లాబీయింగ్ నడిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాము ఎన్ని ఆసుపత్రిల చుట్టు తిరిగినా నయం కాని మోకాలి నొప్పులకు ఇక్కడ ఉపశమనం కలిగిందని కొందరు చెప్పడం విశేషం.

హలో.. మీపై గంటలో ఐటీ రైడ్స్ !



ఆపాలంటే ఓ పది వేలు ఫోన్ పే చేయండి..ఫోన్‌లో భారీగా వసూలు చేస్తున్న ఓ ఆగంతకుడు.. వ్యాపారవర్గాల గగ్గోలు

భీమవరం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 'హలో.. నేను భీమవరం ఆదాయపన్ను శాఖ కార్యాలయం నుంచి ఇన్‌స్పెక్టర్‌ను మాట్లాడుతున్నా. మాపై అధికారులు గంటలో మీ వద్దకు తనిఖీలకు వస్తున్నారు. మీ డాక్యుమెంట్లు అన్ని రెడీ చేసుకోండి. మీ ఫైల్ ప్రస్తుతం నా దగ్గర ఉంది. అధికారులు మీ వద్దకు రాకుండా ఉండాలంటే నా దగ్గర ఉన్న ఫైల్ పక్కన పెడితే రారు. దీనికోసం ఒక అధికారి ఫోన్ నెంబర్ ఇస్తాను.. దానికి ఓ పది వేలు ఫోన్ పే చేయండి. లేకుంటే తనిఖీలకు వచ్చిన అధికారులకు ఏ ఒక్క డాక్యుమెంట్ సరిగా లేకపోయినా ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు ఫైన్ వేస్తారు. ఆ తర్వాత మీ ఇష్టం' అంటూ ఒక అగంతుకుడు ఆక్వా మెడిసిన్ దుకాణాల యజమానులకు బెదిరించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

భీమవరం చుట్టుపక్కల ప్రాంతాలైన ఆకివీడు, గణపవరం, ఉండి, కాళ్ల, పాలకోడేరు, వీరవాసరం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది వ్యాపారులకు ఇలాగే ఫోన్ చేసి ఫోన్ పే చెయ్యండి అంటూ బెదిరించడం ప్రారంభించాడు. అసలు ఆ ఫోన్ చేసిన వ్యక్తి ఎవరు ? భీమవరం ఆదాయ పన్ను శాఖ అధికారి పేరు ఎందుకు చెబుతున్నాడు ? ఏదైనా కార్యాలయంలో పనిచేస్తూ అక్రమ సంపాదన కోసం ఇలా చేస్తున్నాడా ? అన్నది తెలియాల్సి ఉంది. కానీ చాలా మంది ఎందుకొచ్చిన గొడవలే.. ఓ పది పోతే పోయాయి అని భయపడి నగదు చెల్లిస్తూ మోసపోతున్నారు. అయితే ఇప్పటి వరకు ఒక్క ఫిర్యాదు కూడా పోలీసులకు అందలేదు. వ్యాపార వర్గాల్లో మాత్రం దీనిపై పెద్ద చర్చే జరుగుతోంది. ఇటీవల కాలంలో ఇటువంటి మోసాలు భారీగా పెరిగాయి. దీనిపై పోలీసులు ఓ కన్నేయాల్సి వుంది.

ఎట్టకేలకు 104 ఉద్యోగులకు జీతాలు

ముదినేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 104 వాహనాల డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల జీతాల సమస్యకు పరిష్కారం ప్రారంభమైంది. గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు ఆ ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల జీతాలు నిలిచిపోగా, ఆ వాహనాల నిర్వహణకు కాంట్రాక్టుకు తీసుకున్న అరబిందో ఫార్మా కంపెనీ రెండు నెలల జీతాలను ఉద్యోగుల ఖాతాల్లో శనివారం నాటికి జమ చేసింది. అక్టోబరు జీతాల బిల్లులు కంపెనీకి పంపామని త్వరలో చెల్లింపులు జరుగుతాయని అరబిందో కంపెనీ జిల్లా మేనేజర్ విజయ్ తెలిపారు. అయితే సమస్యల పరిష్కారం కోసం ఆదివారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా యథావిధిగా జరుగు తుందని యూనియన్ నాయకులు తెలిపారు.

మునిసిపల్ ఇంజనీర్లకు నోటీసులు

ఏలూరుటూటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో 14వ ఆర్థిక సంఘం ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగంపై ఆరుగురు ఇంజనీర్లపై ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.అనంత రాము విచారణకు ఆదేశించారు. ఆ సమయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేసిన కె.ప్రదీప్‌కుమార్, డిప్యూటీ ఈఈ వీరభద్రరావులకు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం వీరిద్దరు ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం భీమవరంలో డీఈగా పని చేస్తున్న కె.అప్పలరాజు, విశాఖపట్నంలో ఈఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్.సుబ్బారావు, రాజమహేంద్రవరంలో ఈఈగా పని చేస్తున్న ఆర్‌డీఎస్.శేషగిరి, ఏలూరులో డీఈగా పని చేస్తున్న ఎండీ రజాక్‌కు కూడా నోటీసులు జారీ చేశారు. వీరంతా అప్పుడు ఇక్కడే విధులు నిర్వహించారు. 15 రోజుల్లో వీరంతా వివరణ ఇవ్వాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు.

వచ్చే ఏడాది 148 మంది టీచర్లు ఉద్యోగ విరమణ

ఏలూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వచ్చే సంవత్సరం (2025)లో ఉద్యోగ విరమణ చేయనున్న 148 మంది టీచర్ల జాబితాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ శనివారం విడుదల చేశారు. వచ్చే ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు ఎస్జీటీ కేడర్‌లో 82 మంది టీచర్లు రిటైర్ కావాల్సి ఉండగా, వీరిలో అత్యధికులు 18 మంది జూన్‌లో ఉద్యోగ విరమణ చేస్తారు. ఇక స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో మొత్తం 66 మంది రిటైర్ కానుండగా, వీరిలో 11 మంది జూన్‌లో ఉద్యోగ విధుల నుంచి వైదొలుగుతారు.

రియల్‌గా తగ్గింది!



భూముల కొనుగోళ్లు, అమ్మకాల్లో స్తబ్ధత

- రియల్ ఎస్టేట్‌ను వెంటాడుతున్న గత పరిస్థితులు
- కొత్తగా రియల్ భూమ్ కనిపించడంలేదు
- అమ్మకం, కొనుగోళ్లల్లో భారీ వ్యత్యాసం
- తగ్గిన భూమి రిజిస్ట్రేషన్ లావాదేవీలు

గడిచిన ఐదేళ్ల వైసీపీ హయాంలో భూముల ధరలన్నీ ఢమాల్. వ్యవసాయ భూమి అయినా.. వాణిజ్య భూమి అయినా దేనికీ మార్కెట్‌లో తగిన ధరే పలకలేదు. ఆఖరుకి పట్టణ ప్రాంతాల్లో నిర్మించిన అపార్టుమెంట్‌ల్లోను అమ్మకాలు కరవు. రియల్ భూమ్ కాస్తా మందగించడంతో బిల్డర్లు, అమ్మకందారులు నష్టపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా తొలినాళ్ళల్లో భూమి ధరలకు రెక్కలొస్తున్నాయని కాస్తోకూస్తో ఆశపడినా అనుకున్నంత విధంగా భూమి ధరలేవీ పుంజుకోలేదు.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఏమైపోయింది ఆ భూమ్..

ఒకప్పుడు రియల్ ఎస్టేట్ ఇదే జిల్లాలో అందుకోలేనంత వేగంగా పెరిగింది. 2014-19 మధ్యన ఏలూరు నగరంతో సహా అన్ని మునిసిపల్ కేంద్రాలు, సమీప గ్రామాలన్నింటిలోనూ భూమి ధరలు పెరిగాయి. ఏలూరు నగరం పరిసరాల్లో ఇంతకుముందు గజం గరిష్ఠంగా రూ.మూడున్నర వేలలోపు ఉండగా, అదికాస్తా రూ.13 వేలకు చేరింది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో భూమి ధరలు ఎక్కడా తగ్గలేదు. ఎక్కడికక్కడ అమ్మకందారులు ధరలు పెంచుతూ పోయారు. సమాంతరంగా కొనుగోలుదారులూ అంతే స్పీడుతో ఆయా భూములను కొనుగోలు చేశారు. ఆఖరుకి ప్రభుత్వం సవరించిన రిజిస్ట్రేషన్ ధరలతో సహా అన్నీ వేగంగా అందుకోలేనంత పైకి ధరలు ఎదిగాయి. ఏలూరు నగరంలో ఆర్‌ఆర్‌పేట, ఎన్‌ఆర్‌పేట వంటి ప్రాంతాల్లో గజం రూ.90 వేల నుంచి లక్షా 25 వేలకు ఎగబాకింది. ఏలూరు చుట్టుపక్కల రియల్టర్లు అనేక వెంచర్లు వేసి కస్టమర్లను ఆకట్టుకునేవారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడు, కైకలూరు వంటి ప్రాంతాల్లోను అప్పట్లో రియల్ భూమ్ సాగింది. వీటికితోడు వ్యవసాయ భూమి ధరలు అప్పట్లో అనూహ్యంగా పుంజుకున్నాయి. ఎకరాకు రూ.ఐదు నుంచి రూ.13 లక్షలు చొప్పున ధర పెరిగింది. సరాసరిన ఏలూరుకి అత్యంత సమీపాన ఉన్న వ్యవసాయ భూమి ఎకరాకు రూ.70 లక్షల నుంచి రూ.90 లక్షల మేర ధర పలికాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూమి కొనుగోలుకు నగరాల నుంచి అనేకమంది వచ్చిపడేవారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలోను ఎకరా 30 నుంచి 40 లక్షల మేర ధర పలికింది.

గడిచిన ఐదేళ్లలో సర్వనాశనం

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టణం, గ్రామం అనే వ్యత్యాసం లేకుండా భూమి ధరలన్నీ పతనమయ్యాయి. ఎక్కడా రిజిస్ట్రేషన్లు తారస్థాయిలో నమోదుకు ఆస్కారం లేకుండా పోయింది. ఏలూరులో భూమి ధరలన్నీ నిలకడగా మారి క్రయవిక్రయాలకు దూరంగా మిగిలాయి. ఏలూరు పరిసరాల్లో భూమి రిజిస్ట్రేషన్లలో వృద్ధి కంటే క్షీణతే ఎక్కువగా నమోదైంది. అప్పట్లో ఏడాదికి 14 నుంచి 16 కోట్ల రూపాయల మేర ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ ఆదాయం లక్ష్యంగా కాస్తా అవికాస్తా 11 కోట్లలోపే ఆగిపోయింది. ఇలాంటి పరిస్థితి గడిచిన 20 ఏళ్ళల్లో అదే తొలిసారి. వ్యవసాయ భూమి ధరలు నిలకడగా ఉన్నా ఎక్కడికక్కడ కొనుగోళ్లు నిలిచిపోయాయి. నూజివీడులాంటి పట్టణం, పరిసర గ్రామాల్లో ఒకప్పుడు రాజధానికి ప్రతిపాదన వచ్చినప్పుడు అప్పట్లో భూమి ధరలన్నీ ఆకాశాన్నంటాయి. అదే జగన్ హయాం ఐదేళ్లల్లో ధరలన్నీ కుప్పకూలాయి. నూజివీడు చిన్నగాంధీ బొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు, చిన్న గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వరకు గజం రూ.70 వేల ధర పలుకగా ఇప్పుడా భూమి కాస్తా తుస్‌మంది. చింతలపూడి, జంగారెడ్డిగూడెంలలో గజం ఐదు నుంచి ఎనిమిదిన్నర వేల వరకు ధర పెరిగినట్టే పెరిగి గడిచిన ఐదేళ్లుగా ఎక్కడికక్కడ బ్లాక్ అయ్యింది. గడిచిన ఐదేళ్ల జగన్ పాలనలో ఒక్క ఏలూరు జిల్లాలోనే దాదాపు 90కు పైగా అపార్టుమెంట్‌లు వెలవగా వీటిలో సగానికి సగం ఫ్లాట్‌లు కొనుగోళ్ల లేక ఇప్పటికీ అలాగే మూలనపడి ఉన్నాయి.

అంతా నాశనమైంది



గడిచిన ఐదేళ్ల జగన్ పాలనలో రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. అమ్మకాలు ఇప్పుడు అటూ ఇటూ కాకుండా పోయాయి. ఇప్పుడు భూముల ధరలు పెరిగినప్పటికి కొనుగోళ్లు బాగా తగ్గాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి రెండు నెలల్లో ధరలు అమాంతంగా పెరిగాయి. ఇప్పుడేమో దిగొచ్చాయి. రియల్ ఎస్టేట్‌లో ఒడిదుడుకులు ఎగుడుదిగుడులో ఉన్నాయి. గడిచిన ఐదేళ్లల్లో భూముల అమ్మకాలు, కొనుగోళ్ళు సర్వనాశనమయ్యాయి.

- జువ్వూరి వెంకయ్య, రియల్ వ్యాపారి, నూజివీడు

కూటమి వచ్చింది.. భూమ్ రాలేదు

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే భూముల ధరలు పెరిగినట్టు పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. తొలిమాసంలో సైతం రిజిస్ట్రేషన్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడాయి. కాని వెంటనే మళ్ళీ స్తబ్దత ఏర్పడింది. దీనికి ప్రధాన కారణం కొనుగోలు, అమ్మకాల మధ్య వ్యత్యాసం భారీగా పడిపోవడం ఒక ఎత్తయితే కొనుగోలుదారుల్లో ఆసక్తి సన్నగిల్లడం ఇంకొక కారణం. వ్యవసాయ భూములు సైతం ఇలాంటి పరిస్థితే నెలకొంది. జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం సాగుతున్న ప్రాంతాల్లో గడిచిన మూడు నెలలుగా భూమి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇక్కడ ఎకరా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల మేర పెరిగి ఆ మేర రూ.60 లక్షలకు ధర చేరింది. ఈ ఒక్క ప్రాంతంలోనే అమ్మకం, కొనుగోళ్లల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఆఖరుకి జగన్ ప్రభుత్వ హయాంలో అగ్రిమెంట్ చేసుకున్న భూములన్నింటికీ ఈ మధ్యనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయే తప్ప కొత్తగా కొనుగోళ్ల ఏవీ లేనేలేవు. దీనికంతటికి మార్కెట్‌లో ఉన్న మాంద్యమే కారణంగా కనిపిస్తోంది.



వరించిన అదృష్టం

ఉమ్మడి పశ్చిమలో నలుగురికి నామినేటెడ్ పదవులు

ప్రభుత్వ సలహాదారుగా షరీఫ్

కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా కొత్తపల్లి సుబ్బారాయుడు

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా కనకరాజు సూరి

ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడు

తొలి విడతలో నాలుగు.. తాజాగా నాలుగు పదవులు

కూటమి పార్టీల్లో మరికొందరు సీనియర్ల ఎదురుచూపు 7

వృద్ధాప్యంలో వీలునామా

తల్లిదండ్రుల ఆస్తుల కోసం వారసుల మధ్య వివాదం 6

శ్రీవారి నిత్యార్జిత కల్యాణం రికార్డు



ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయంలో రికార్డు స్థాయిలో స్వామి వారి నిత్యార్జిత కల్యాణం 175 జంటలతో శనివారం ఆలయ కల్యాణ మండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. కార్తీక మాసం పవిత్రమైన రోజులు కావడంతో అధిక సంఖ్యలో జంటలు పాల్గొని ఈ ఆర్జిత సేవను జరిపించుకున్నారు. మరోవైపు శ్రీ వారి ఆలయం భక్తులతో పోటెత్తింది. కార్తీకమాసంలో పెళ్లిళ్ల జరగడం, రెండో శనివారం కావడంతో భక్తులు వేలాదిగా వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 30 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్టు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. ఉచిత దర్శనానికి దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు..వీక్షిస్తున్న భక్తులు

చిన్న వెంకన్న ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవ ప్రారంభమైంది. - వివరాలు 6లో

ఉత్తమ సేవలకు దక్కిన పురస్కారం

జిల్లా నుంచి నలుగురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

'గిరి' బిడ్డలను బడిదారి పట్టించి..



ఏలూరు రూరల్ మండలం ఇందిరా కాలనీ ఎంపీయూపీ స్కూలులో బీఎస్ టీచరుగా పని చేస్తున్న గుగ్గులోతు కృష్ణ 1997 ఏప్రిల్‌లో ఎస్టీటీగా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. 2011లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. జిల్లాలో చింతలపూడి, టి.నరసా పురం మండలాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న కాలంలో స్థానిక గిరిజన తండాల్లోని బాలబాలికలను బడిలో చేర్పించడంలో, వారికి ఆర్థికంగా తోడ్పాటునందించ డంలో చురుకుగా వ్యవహరించారు. డ్రాపవుట్ పిల్లల ను బడికి రప్పించడంలో తల్లిదండ్రులను ఒప్పించి సక్సెస్ అయ్యారు. కలరాయన గూడెం స్కూలులో పనిచేస్తున్న రోజుల్లో అక్కడి స్కూలునుంచి ఒకేసారి ముగ్గురు పేదవిద్యార్థులు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికకాగా, ప్రతిభావంతులైన ఆ ముగ్గురు విద్యార్థుల కైన మొత్తం ఖర్చులను ఈయన భరించారు. గిరిజన మండలాల్లో ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ, విద్యార్థుల కు నోట్‌పుస్తకాలు, పేద విద్యార్థులకు ఫీజుల చెల్లింపులో ఇప్పటికీ సాయా న్ని కొనసాగిస్తున్నారు.

ఏలూరు అర్బన్/ఉంగుటూరు/దెందులూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని (సెప్టెంబరు 5) పురస్కరించుకుని వృత్తిలో ఉత్తమసేవలందించిన టీచర్లకు అందజేసే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎంపికైనవారి జాబితాను విద్యాశాఖ శనివారం విడుదల చేసింది. సెప్టెంబరులో వచ్చిన వరదల కారణంగా విజయవాడలో జరగాల్సిన పురస్కారాల అందజేత కార్యక్రమాన్ని వాయిదా వేసి, తాజాగా ఈ నెల 11న నిర్వహిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతి (నవంబరు 11) సందర్భంగా పాటించే జాతీయ విద్యాదినోత్సవాన్ని ఆ రోజున విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే రాష్ట్రప్రభుత్వ కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేయనున్నారు. కాగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. అయితే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఈ జిల్లాల్లో ఎంపికైన ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం వాయిదా వేశారు. జిల్లాలో ఉంగుటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఎస్.పెద్దిరాజు, ఉంగుటూరు మండలం కైకరం జడ్పీ హైస్కూలు ఫిజికల్ సైన్స్ టీచరు కూనాటి జాన్, దెందులూరు హైస్కూల్ ప్లస్ (జడ్పీ జూనియర్ కళాశాల) బయోలాజికల్ సైన్స్ టీచరు బి.ఎస్.ఎన్.కళ్యాణి, ఏలూరు మండలం ఇందిరాకాలనీ మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సోషల్ స్టడీస్ టీచరు గుగ్గులోతు కృష్ణకు రాష్ట్ర పురస్కారాలు లభించాయి. ఉత్తమ అవార్డుతో తమ బాధ్యత మరింత పెరిగిందని వారు పేర్కొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో బోధన..



బీఎస్ఎన్‌కే కల్యాణి దెందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలాజీ సైన్సు టీచర్‌గా పని చేస్తున్నారు. విద్యార్థులకు అర్థమైయ్యే విధంగా బోధించడంతో పాటుగా విద్యార్థులను ప్రభావితం చేసే సోషల్ యాక్టివిటీ, హెల్పింగ్ నేచర్ అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడం, విద్యలో వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో బోధన చేస్తుంటారు. 2023లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు. ఈమె తాతయ్యలు ఇద్దరూ, తల్లి బి.నాగలక్ష్మి, తండ్రి శేషగిరిరావు, మావయ్య సత్యనారాయణ రిటైర్డ్ టీచర్లే కాగా భర్త రాజకుమార్ గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తుండడం విశేషం.

45 మంది విద్యార్థుల నుంచి..



శిరిమామిళ్ళ పెద్దిరాజు 1995లో కోరుమిల్లిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా చేరారు. 2001 నుంచి 2010 వరకు పెంటపాడు మండల లిటరసీ ఆర్గనైజర్‌గా పని చేశారు. 2019లో నిడమర్రు మండలం భువనపల్లిలో ఎల్.ఎఫ్.ఎల్ ఉపాధ్యాయుడిగా చేరారు. అక్కడ కేవలం 45 మంది పిల్లలు ఉండగా 200 మంది ని చేర్చి పాఠశాలను యూ.పి.పాఠశాలగా తీర్చిదిద్దడం విశేషం. ప్రస్తుతం ఉంగుటూరులో ఎంపీపీ పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్నారు.

విద్యార్థులకు మంచి గైడ్‌గా..



కునాటి జాన్ కైకరం హైస్కూలు ఫిజిక్స్ టీచర్‌గా పని చేస్తున్నారు. 2005లో నిడమర్రు మండలం తోకలపల్లిలో ఉద్యోగంలో చేరారు. 2017 నుంచి కైకరంలో పనిచేస్తున్నారు. ఈయన గైడెన్స్‌లో ఐదుసార్లు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైయిర్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈయన గైడెన్స్‌లోనే కైకరం హైస్కూలుకు చెందిన మారిశెట్టి దుర్గా మంగ 'లోకాస్ట్ రోప్ మేకింగ్' అంశంలో జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ ప్రదర్శనలో పాల్గొంది.

తాడేపల్లిగూడెంకు చెందిన ముగ్గురు అన్నదమ్ముల మధ్య ఆస్తుల పంపకంతో మనస్పర్థలు గొడవ పడ్డారు. వివాదాలతో కోర్టుమెట్లెక్కారు. అయినా ఫలితం దక్కలేదని అన్నదమ్ముల్లో ఒకరు హత్యకు గురైన సంఘటన విచారకరం. ఆ కుటుంబానికి చెందిన ఆస్తులు ఇప్పటికీ నిరర్థకంగా ఉన్నాయి. ఆ కుటుంబ పెద్ద కష్టపడి సంపాదించిన ఆస్తులు అతని వారసులు నేటికీ అనుభవించలేకపోతున్నారు.!

రాజమండ్రికి చెందిన వ్యాపారి సినిమా థియేటర్ల నిర్వహణలో అందె వేసిన చెయ్యి. గణపవరం, రాజమండ్రి, నరసాపురంలో థియేటర్లు నిర్వహిస్తూనే రైస్‌మిల్లు వ్యాపారంతో ఎన్నో ఆస్తులు కూడబెట్టారు. ఆస్తులు పంపకం చేయకుండా మరణించడంతో వారసుల మధ్య తగాదాలు నేటికీ పరిష్కారం కాలేదు. 25 ఏళ్లుగా ఆస్తుల కోసం వారసులు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. నేటికి నిరర్థక, న్యాయ వివాదంలో ఉన్న ఆస్తులుగా ఉన్నాయి.!

కోనసీమ జిల్లా లంక గ్రామంలో ఒకరికి ఏడుగురు కొడుకులు, ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఆస్తుల కోసం కొట్లాటలో ఒక కుమారుడు తల్లి బంగారం మొత్తం స్వాధీనం చేసుకున్నారు. మరొకరు తండ్రి నుంచి ఆస్తి అక్రమంగా సంతకాలు చేయించుకొని ఆస్తి స్వాధీనం కోసం ప్రయత్నించిగా మిగతా అన్నదమ్ములు గొడవలు పడుతున్నారు. ఆస్తి గొడవలతో వారిలో ఇద్దరు కొడుకులకు 40 ఏళ్లు దాటినా వివాహం కాలేదు.!

సండే స్టోరీ



వృద్ధాప్యంలో వీలునామా



భార్య, పిల్లలు సుఖంగా సంతోషంగా ఉండాలని కుటుంబ పెద్ద ఆరాటం. పిల్లల భవిష్యత్ కోసం నిరంతరం శ్రమించి ఆస్తులు కూడబెడతారు. తండ్రి కష్టం, అమ్మ చూపిన ప్రేమతో పిల్లలు సంతోషంగా ముందడుగు వేస్తారు. పిల్లలు ఒక స్థాయికి చేరిన తర్వాత, తల్లిదండ్రుల వృద్ధాప్యంలో సమస్యలు తలెత్తుతాయి. తండ్రి కష్టపడిన సంపాదించిన ఆస్తుల పంపకంలో మనస్పర్థలు పొడచూపుతున్నాయి. ఆస్తిలో నాకు వాటా రాదా.. అని కూతురు. నాన్న నాకు ఇంటిస్థలం ఇవ్వడా.. అంటూ కొడుకు గొడవపడి చివరికి కుటుంబాల మధ్య పూడ్చలేని అగాథం పెరిగిపోతోంది. సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ వారసులు ఆస్తి పంపకాలపై రచ్చకెక్కడం, తల్లి, అన్నాచెల్లెళ్ల వివాదం కుటుంబ సంబంధాల తీరుకు అద్దం పడుతుంది. ముందుగానే తల్లిదండ్రులు వీలునామా సిద్ధం చేయడం ఒక పరిష్కారంగా కొందరు భావిస్తున్నా అది పెద్దల సంక్షేమానికి విఘాతంగా మారుతోంది. తల్లిదండ్రులు రాసిన వీలునామాలో తనకు ప్రాధాన్యం ఇవ్వలేదని వారిని పట్టించుకోని పిల్లలూ ఉన్నారు. ఆస్తిని వారసులకు చెందేలా వీలునామా సిద్ధం చేయడం ఆ తండ్రికి సంపాదనకు మించిన కష్టంగా మారింది. తల్లి లేదా తండ్రి మరణానంతరం ఫోర్జరీ సంతకాలతో వీలునామా సృష్టించే పుత్రరత్నాలు లేకపోలేదు. ఎటువంటి వివాదాలు, మనస్పర్థలు లేకుండా ఆస్తులను పంచుకునే వారసులను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఆస్తుల పంపకాలు సక్రమమైతేనే ఆప్యాయతలు నిలబతాయంటూ ఈ ఆదివారం ప్రత్యేక కథనం. - నిడమర్రు

- తల్లిదండ్రుల ఆస్తుల కోసం వారసుల మధ్య వివాదం
- పంపకాల్లో సమస్యలు
- కుటుంబాల్లో మనస్పర్థలు
- వృద్ధ దంపతుల నిస్సహాయత
- పంపకాలు సక్రమమైతేనే ఆప్యాయత, అనురాగం

జీవితమంతా కష్టపడిన కుటుంబ పెద్ద జీవిత చరమాంకంలో వారసుల మధ్య మనస్పర్థలతో మనశ్శాంతి లేకుండా గడుపుతున్నాడు. చాలా కుటుంబాల్లో ఆస్తి వివాదాలే కనిపిస్తున్నాయి. ఆస్తులు, వాటాల పంపకం తోబుట్టువుల మధ్య మనస్పర్థలకు దారితీస్తున్నాయి. తమ్ముడు ఎక్కువ పొలం రాయించేసుకొన్నాడని అన్నగారు. అన్నగారు ఎక్కువ ఇంటి స్థలం తీసేసుకొన్నాడని తమ్ముడు వివాదాలు సాధారణం అయ్యాయి. తండ్రి వృద్ధాప్యంలో కుమారుడు, లేదా కుమార్తె వద్ద ఉండడం, వారి ప్రలోభంతో ఆస్తి పంపకంలో వివక్ష వివాదాలకు ఆజ్యం పోస్తుంది.

వాటా పంపకంలో సమస్యలు

తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడి ఆస్తులు సంపాదిస్తుంటే సక్రమంగా, చట్టబద్ధంగా పంపకం చేసుకోక అత్యాశ, స్వార్థంతో చేసే తప్పుల వల్ల ఎన్నో కుటుంబాలు విడిపోతున్నాయి. ఒకే కుటుంబంలో పిల్లల్లో ఒకరు పేదరికంలో ఉంటే, మరొకరు తండ్రి ఆస్తి మొత్తం రాయించుకుని విలాసంగా జీవిస్తున్నారు. సంతానంలో ఎవరో ఒకరు తెలివితేటలతో ఆస్తి వ్యవహారాలన్నీ చక్కబెడుతూ తండ్రికి చేయూతగా ఉంటాడు. నలుగురు కొడుకులలో పెద్దోడికి చదువు అబ్బక స్థానికంగా ఉంటూ తండ్రి ఆస్తులను పరిరక్షణ బాధ్యత చూస్తాడు. మిగతా ముగ్గురు చదువుకొని ఉద్యోగ రీత్యా సుదూర ప్రాంతాలలో బతుకుతూ అన్నగారు ఇచ్చిన తృణమో, పణమో తీసుకొంటూ కాలం వెళ్లదీస్తూంటారు. తండ్రి మరణానంతరం ఆస్తుల పంపకాలకు వచ్చేసరికి ఇదంతా నేను కష్టపడి కూడదీసినది, నాకు ఎక్కువ వాటా కావాలని దౌర్జన్యం చేయడంతో సమస్య మొదలవుతుంది. మిగిలిన వారు అతి తెలివితేటలు, బంధువుల పోద్బలంతో ముసలి తండ్రి నుంచి మిగతా తమ్ముళ్లకు తెలియకుండా ఆస్తులు రాయించుకోవడం గొడవ పెద్దది చేస్తుంది. వారసులందరికీ సమాన వాటా ఇవ్వాలని మిగతా తమ్ముళ్ల మొరపెట్టుకొన్నా ఉద్యోగరీత్యా పొరుగున ఉండడంతో వారి మాట చెల్లుబాటు కాని దుస్థితి గ్రామాలలో అనేకం.

కుటుంబాల్లో మనస్పర్థలు

తండ్రి అనంతరం ఆస్తి పంపకాల్లో వివాదాలు కుటుంబాల్లో మనస్పర్థలు నింపుతున్నాయి. ఇటీవల కొల్లేరు తీరగ్రామంలో జరిగిన సంఘటన తెగిపోతున్న కుటుంబ సంబంధాలకు అద్దం పడుతుంది. తండ్రికి ఇద్దరు కుమారుల్లో పెద్దోడు ఊరిలో ఉంటూ తండ్రిని, ఉద్యోగ రీత్యా పొరుగూరు వెళ్లిన తమ్ముడు ఆస్తులను కూడా చూసుకునేవాడు. ఇద్దరు కొడుకలకు చేరో వాటా ఇచ్చి తన భక్షణ కు కొంత భూమి ఉంచుకుని తండ్రి వీలు రాశాడు. వృద్ధాప్యంలో పట్టణంలో కుమారుడి వద్ద ఉండలేని తండ్రి స్వగ్రామంలో వ్యవసాయం చేసుకొంటున్న పెద్ద కుమారుడి దగ్గరకు చేరుకున్నాడు. బంధుమిత్రులతో తన వాటా సొమ్మును తన కొడుకులతో పాటు ఎప్పుడో పెళ్లి చేసి పంపేసిన కుమార్తెకు ఇవ్వాలని చెబుతుం డేవాడు. ఇది సహించని పెద్ద కొడుకు తండ్రికి మాయమాటలు చెప్పి తండ్రి పేరున ఉన్న మూడెకరాల భూమిని తన పేరున రాయించేసు కొన్నాడు. తండ్రి మరణం తర్వాత విషయం తెలిసిన తమ్ముడు తన అన్నగారు చేసిన మోసం తట్టుకోలేక తండ్రి ఇచ్చిన ఆస్తిని అమ్మేశాడు. స్వగ్రామంలో కట్టుకొన్న ఇల్లు కూడా అయినకాడికి అమ్మి ఊరికేదూరమయ్యాడు.

వృద్ధాప్యం.. సర్దిచెప్పలేని నిస్సహాయత

తండ్రి పిల్లలను అదుపు ఆజ్ఞతలతో పెంచినా వృద్ధాప్యంలో కుమారులపై పట్టు తగ్గుతుంది. కుటుంబంలో ఎవరో ఒకరిపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్తుల వ్యవహారాలలో ఆయన నిర్ణయం నామమాత్రమే అవుతుంది. మలి వయసులో ఎవరిని మందలించలేక, సర్దిచెప్పలేక మౌనంగా కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి. కుటుంబంలో పనులు చక్కబెట్టే వారు మిగిలిన వారి ఆస్తుల పై కన్నేసి వ్యవహారాన్ని అనుకూలంగా మలుచుకొంటున్నారు. కుటుంబ పెద్ద ముందుగానే తాను సంపాదించిన, పూర్వీకుల ఆస్తిని వార సులందరినీ కూర్చోబెట్టి సమన్వయం చేయాలి. తప్పులను మందలించి వారసులకు చట్టబద్ధమైన హక్కులతో ఆస్తిపాస్తులు పంచడ మే ఉత్తమ మార్గంగా కనబడుతోంది.

వాటాలే ఉత్తమ మార్గం

కుటుంబ సభ్యులకు ఆస్తులను విభజించడం ద్వారా తండ్రి, తల్లి, కొడుకు, కూతరు మధ్య పంపకాలు నిర్వహించుకోవచ్చని చట్టం తెలియజేస్తున్నది. తండ్రి ఒక వాటా తీసుకొని మిగతా ఆస్తిని తన కుటుంబ సభ్యుల మధ్య రిజిస్ట్రార్ ఆఫీసులో వాటాలు రాసుకోవచ్చు. దీని నిమిత్తం చట్టపరంగా కొంత ఫీజు చెల్లించాల్సి వస్తుంది. ఈవిధంగా సంక్రమించిన ఆస్తికి పూర్తి చట్టభద్రత ఉంటుంది. రెవెన్యూ శాఖ, పంచాయితీ రాజ్ శాఖ తక్షణం ధ్రువీకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పూర్వార్జిత ఆస్తిని వారసులందరికీ పంచాలి. తన వాటా ఆస్తిని ఎవరికైనా రాయవచ్చు.

నోటిమాటకు విలువ?

చాలామంది కుటుంబ పెద్దలు చేస్తున్న పెద్ద తప్పు తన తదనంతరం ఈ ఆస్తి అంతా మీకే కదా అనడం. ఒక్కడివే కొడుకు కదా, ఆడపిల్లకు ఇవ్వాల్సినది ఇచ్చేశాం కదా, ఇదంతా నీదే అని చెబుతుంటారు. బయట బంధువులకు కూడా ఇదే మాట చెబుతూ కాలం వెళ్లదీస్తుంటారు. వారి జీవించి ఉన్నంత కాలం అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్ళు మధ్య ఏ సమస్య రాదు. తండ్రి మరణాంతరం వారు వారసత్వ హక్కు పొందే సమయంలో అసలు సమస్య వస్తుంది, అప్పటి వరకు మౌనంగా ఉన్న అక్క, చెల్లికి వారి అత్త మామలు తరుపు బంధువులు ఆస్తిలో వాటా వస్తుంది, సమాన హక్కు, సగం హక్కు వస్తుందని చెబుతూ వ్యవహారం ముడిపడేలా చేస్తుంటారు. భీమవరంలో ఒక జమిందారీ కుటుంబంలో ఇలాంటి సమస్య వచ్చి పడింది. వివాహమైన 30 ఏళ్ల తర్వాత తండ్రి మరణాంతరం ఆస్తి పంపకాలు, వారసత్వపు హక్కు సమస్యతో మొదలై కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

వీలునామా ఎందుకు?

ఎంత విలువైనా ఆస్తినైనా తక్కువ ఖర్చుతో బదలాయించడానికి చట్టం కల్పించిన ఉత్తమ మార్గం వీలునామా. ఒకరి స్వార్జిత ఆస్తిని వీలునామా ద్వారా తనకు నచ్చిన వారికి రాయవచ్చు. పూర్వార్జిత ఆస్తిలో తనకు సంక్రమించిన ఆస్తిని కూడా ఎవరికైనా రాయవచ్చు. వీలునామా రిజిస్టర్డ్, అన్ రిజిస్టర్డ్ ఉంటాయి. రిజిస్టర్డ్ వీలునామా బహిర్గతం. అన్ రిజిస్టర్డ్ వీలునామాను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉండదు. సీల్డ్‌కవర్‌లో రిజిష్ట్రార్ ఆఫీసులో భద్రపరచుకోచ్చు. అతడి మరణాంతరం కుటుంబ సభ్యుల మధ్య దానిని బహిర్గతం చేస్తారు. రిజిస్టర్డ్, అన్ రిజిస్టర్డ్ వీలునామా ఏదైనా ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఎప్పుడైనా, ఎన్నిసార్లు అయినా మార్పుచేసే వీలుందని న్యాయనిపుణులు చెబుతున్నారు. వీలునామా రాసే సమయంలో అతడు మానసిక, శారీరక ఆరోగ్యంతో ఉన్నానని తెలుపుతూ ఇష్టపూర్వకంగా వీలునామా రాస్తున్నట్లు పేర్కొంటేనే చెల్లుబాటు అవుతుందని నిపుణులు చెబుతున్నారు.

స్వీయ పోషణకు కొంత ఆస్తి

కుటుంబ పెద్ద వృద్ధాప్యంలో ఆసరా కోసం కొంత ఆస్తి ఉంచుకోవాల్సిందే. ఉన్న ఆస్తినంతా కొడుకులకు, కూతుళ్లకు పంచి రోడ్డున పడాల్సిన పరిస్థితి లేకుండా వృద్ధ దంపతులు కొంత ఆస్తి ఉంచుకోవాలని ఆర్థిక నిపుణుల సూచన. తమ వాటాగా కొంత స్థిర, చరాస్తులను ఉంచుకోవాలని న్యాయవాదులు సూచిస్తున్నారు. వృద్ధాప్యంలో వారికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని చెబుతున్నారు. ఆస్తుల పంప కాలు సక్రమమైతేనే ఆప్యాయతలు నిలబతాయి. కుటుంబ పెద్ద ఎంతో కష్టపడి తన వారసుల కోసం సంపాదించిన సొమ్ము, ఆస్తిని ఆ వారసులు సర్వహక్కులతో చట్టబద్దమైన ఆస్తిగా పొందాలంటే ఆ కుటుంబ పెద్ద వీలునామా ద్వారా, ఆస్తుల పంపకం ద్వారా గానీ ఆస్తి బదలాయింపు చేయడమే ఉత్తమ మార్గం. లేకుంటే వారసుల మధ్య వివాదమే..!

వీలునామా ఉత్తమ మార్గం



ఒకరి ఆస్తిని వారసులకు చట్టబద్ధంగా బదలాయించడానికి వీలునామా ఉత్తమం. స్వార్జిత ఆస్తిని అతి తక్కువ ఖర్చుతో బదలాయింపు చేసుకోవచ్చు. రిజిస్టర్డ్, అన్‌రిజిస్టర్డ్ వీలునామా రాయవచ్చు. జీవితంలో ఎన్నిసార్లైనా మార్పు చేయవచ్చు. వీలునామా సంపూర్ణ ఆరోగ్యంతో మాత్రమే రాయాలి. భాగాలు స్పష్టం చేసి పూర్వార్జిత ఆస్తి చట్టబద్ధ వారసులందరికి బదలాయించవచ్చు. తండ్రి, తల్లి, కుమారులు, కుమార్తెలకు వాటాలు పంపిణీ చేయవచ్చు.

బీవీ.కృష్ణారెడ్డి ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఏలూరు జిల్లా కోర్టు

వీలునామా ద్వారా ఆస్తి బదలాయింపు



కుటుంబ పెద్ద స్వార్జిత ఆస్తిని తనకు ఇష్టమైన వారికి వీలునామా ద్వారా బదలాయించవచ్చు. మరణాంతరం మాత్రమే వీలునామాలో పేర్కొన్న వారికి ఆస్తిపై చట్టబద్ధ హక్కు వస్తుంది. పూర్వార్జిత ఆస్తిని వారసులందరూ కూర్చొని బదలాయింపు చేసుకోవచ్చు. చట్టబద్ధమైన ఆస్తిని కుటుంబ పెద్ద తన వారసులకు ఇవ్వడం బాధ్యత. ఆస్తులు సంపాదించడం ఎంత గొప్పో తన వారసులకు సమస్యలు లేని ఆస్తులను పంపకం చేయడం అంతకన్నా గొప్ప విశేషం.

నిమ్మల సాంబమూర్తి, దస్తావేజు లేఖరి, గణపవరం

కుటుంబ సభ్యుల సమక్షంలో పంపకం మేలు



జీవిత కాల కష్టార్జితం వారసులకు సక్రమంగా ఇవ్వాలి. కుటుంబ సభ్యులందరినీ కూర్చోబెట్టి ఆస్తి పంపకాలు చేసుకోవడం ద్వారా భవిష్యత్ లో ఎటువంటి సమస్యలు రావు. ఆస్తిని వారసులు పూర్తి సర్వ హక్కులతో అనుభవిస్తారు. నా కష్టార్జితం, పూర్వార్జితం నాతో పాటు నా భార్య పోషణ, వైద్య ఖర్చుల కోసం కొంత వాటా ఉంచుకొన్నా. మిగతా ఆస్తిని వారసులకు పంచాను. వాటాల పంపకంతో కుటుంబ సభ్యుల మధ్య ఎటువంటి సమస్యలు రావు. పూర్తి యాజమాన్య హక్కులతో అనుభవిస్తారు.

కొట్టాడ పెదవెంకన్న, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, ఏలూరు



సహస్రదీపాలంకరణ సేవ ప్రారంభిస్తున్న దాత, చైర్మన్, స్వామి, అమ్మవార్లకు హారతి

శ్రీవారి క్షేత్రంలో సహస్ర దీపాలంకరణ సేవ

- ప్రతి శనివారం ఆర్జిత సేవ
- 16 నుంచి భక్తులకు అందుబాటులో..

ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్న తిరుమలేశుని క్షేత్రంలో స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ శనివారం రాత్రి ప్రారంభమైంది. ముందుగా శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై ఆలయ నిత్య కల్యాణ మండపం వద్ద సహస్ర దీపాలంకరణ మండపానికి మంగళ వాయిద్యాల తరలివచ్చారు. మండపాన్ని, సేవను దాత పీపీ.రాజు, చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మండపంలో 1008 నేతి వత్తులను వెలిగించారు. నేతి దీపాల నడుమ శ్రీవారు కొలువైన తిరుచ్చిని గొలుసులతో వేలాడతీసి అర్చకుల వేదమంత్రోచ్ఛరణ, ప్రముఖ గాయని శోభారాజ్ ఆలపించిన అన్నమయ్య కీర్తనలతో ఊయలను ఊపారు. తర్వాత నివేదన జరిపి స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతిని సమర్పించారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్‌వి సుధాకరరావు, ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో ఎస్వీ సత్యనారాయణమూర్తి, మండప దాత పీపీ.రాజు తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అన్నమయ్య భావనా వాహిని వ్యవస్థాపకు రాలు, పద్మశ్రీ శోభారాజ్ తన గానంతో శ్రోతలను మైమరపింపజేసారు. మండప నిర్మాత పీపీ రాజును ఆలయ చైర్మన్ ఘనంగా సత్కరించారు.

సహస్ర దీపాలంకరణ సేవను ఈనెల 16 నుంచి భక్తులకు ఆర్జిత సేవగా అందుబాటులో ఉంటుందని చైర్మన్ సుధాకరరావు తెలిపారు. ప్రతీ శనివారం జరిగే ఈసేవ నిమిత్తం భక్తులు రూ.500 చెల్లించాలన్నారు. శాశ్వత విరాళంగా రూ.5000 చెల్లిస్తే పదేళ్లపాటు ఏడాదికో శనివారం దాతలు పాల్గొనవచ్చని తెలిపారు. ఈసేవలో పాల్గొనే భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు శేషవస్త్రం, కండువా, రవిక, పటికబెల్లం, పసుపు, కుంకుమ అందజేస్తామని భక్తులు గమనించాలని కోరారు.



నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌లు వచ్చేశాయ్

ఆచంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పొలాలు, స్థలాలు, ఇళ్లు భవనాలు, తదితర స్థిరాస్తుల క్రయ విక్రయాలు, ఒప్పందాలకు నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌లు ఉపయోగించేవారు. గత వైసీపీ ప్రభుత్వం నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌ల స్థానంలో ఈ స్టాంప్‌లు ప్రవేశ పెట్టింది. అప్పట్లో అనేక మంది కక్షిదారులు ఈ-స్టాంపులను వ్యతిరేకించారు. దశాబ్దాల కాలంగా ఆస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ కు నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌లు ఉపయోగించేవారు. రిజిస్ట్రేషన్ అనంతరం ఆ పత్రాలనే వ్యవహారికంలో దస్తావేజులుగా ప్రజలు గుర్తించేవారు. నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌లు నాణ్యతతో ఉండడంతో కొన్ని తరాల పాటు చెక్కుచెదరకుండా వారసులకు ఆస్తుల రుజువు పత్రాలుగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం వాటి సరఫరా నిలుపుదల చేసి ఈ-స్టాంప్‌లు తేవడంతో కక్షిదారుల్లో గందరగోళం నెలకొంది. వాటి నాణ్యతలేక పోవ డమే కాకుండా ఇప్పటి వరకు దస్తావేజులుగా అలవాటైన పత్రాల స్థానంలో ఈ-స్టాంపులను ఊహించుకోలేకపోయారు. రంగు కూడా మారిపోవడంతో అనేక మంది వ్యతిరేకించారు. కూటమి ప్రభుత్వం తిరిగి నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌లను సబ్ రిజిస్ట్రార్ కార్యాయాలకు అందజేసింది. స్టాంప్ వెండర్స్ వాటిని విక్రయిస్తున్నారు.

స్పోర్ట్స్ కాలమ్



క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్

క్రీడలు విద్యార్థి జీవితానికి ఉత్తేజం

- బాల్ బాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పెదవేగి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థి జీవితాన్ని ఉత్తేజితం చేస్తాయని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈవో) బి.ప్రభాకర రావు అన్నారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో పెదవేగిలో రెండు రోజుల పాటు జరగనున్న అండర్ 19 రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. క్రీడలు విద్యార్థులను ఉన్నతమైన భవిష్యత్ దిశగా నడిపిస్తాయని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏదొక క్రీడలో ప్రావీణ్యం సాధించాలన్నారు. ప్రతిఒక్కరూ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తారని, కానీ విజయం ఒకరినే వరిస్తుందన్నారు. ఓటమితో జీవితం ముగిసినట్లు కాదని, రేపటి విజయానికి తొలిమెట్టుగా స్ఫూర్తితో ముందుకెళ్ళాలని ఆయన సూచించారు. మన విజయం మరొకరికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రస్థాయిలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు మొత్తం 26 పాల్గొనే ఈ పోటీల్లో ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెదవేగిలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, క్రీడా పరిశీలకుడు డి.రాజేంద్రప్రసాద్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు, పీఈటీ గురుమూర్తి, ఆయా జిల్లాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ జిల్లా జట్లు

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- అంతర్ జిల్లా టెన్నికాయిట్ పోటీలు

చింతలపూడి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు నైపుణ్యంతో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని నూజివీడు ఉప విద్యాశాఖ అధికారి ఎం.సేవియా అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో 68వ ఏపీ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆటలతో ఆరోగ్యంగా ఉంటార న్నారు. క్రీడాకోర్టులను ప్రారంభించిన సీఐ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడా అనుభవాలను తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పావని మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడా పరిశీలకులు ఎన్‌టి. ప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేశారు. గతేడాది స్కూల్ గేమ్స్‌లో తొలగించిన టెన్నికాయిట్ పోటీలను జాతీయస్థాయిలో జరిగేవిధంగా పునరుద్ధరించాలన్నారు. అంతర్జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఉన్నారన్నారు.

అండర్ 14, 17, 19 విభాగాలలో లీగ్‌నాకౌట్ పద్ధతిలో శనివారం, ఆదివారం జరిగే పోటీల్లో 13 జిల్లాల క్రీడాకారులు పాల్గొంటారు. తొలిరోజు బాలికలు 195, బాలురు 190, కోచ్‌లు78 మంది, 40 మంది టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన లక్ష్మణ్, మాధురి, జాతీయస్థాయిలో పతక విజేతలు ఎనిమిది మందిని సన్మానించారు. అలివేలు మంగ, సురేష్‌కుమార్, సుధాకర్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



అద్భుత విన్యాసం మాల్కంబ్ పోల్

రాణిస్తున్న క్రీడాకారులు.. భీమవరంలో ఉత్సాహంగా పోటీలు

అద్భుత విన్యాసాలతో అచ్చెరువొందించే క్రీడ మాల్కంబ్ పోల్. విలక్షణ ఆట రోప్ స్కిప్పింగ్. ఈ రెండు క్రీడలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. భీమవరం చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో 68వ ఏపీ అండర్ 14, 17, 19 అంతర్ జిల్లాల మాల్కంబ్, రోప్ స్కిప్పింగ్ పోటీలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల క్రీడాకారులు సత్తాను చాటుకున్నారు. మాల్కంబ్ పోల్‌పై అచ్చెరువొందే విన్యాసాలతో రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారు. రాష్ట్రస్థాయి బహుమతులు సాధించిన క్రీడాకారులను ఆంధ్రజ్యోతి పలకరించింది. - భీమవరం అర్బన్



రోప్ స్కిప్పింగ్ అంటే చాలా ఇష్టం



రోప్ స్కిపింగ్ అంటే చాలా ఇష్టం.. భీమవరంలో 8వ తరగతి చదువుతున్నా. అండర్ 14 రోప్ స్కిప్పింగ్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి సాధించడం ఆనదంగా ఉంది. సీబీఎస్ జాతీయ స్థాయిలో కూడా బంగారు పతకం సాధించాను. జాతీయ స్థాయిలో 2, రాష్ట్రస్థాయిలో 4 బంగారు పతకాలు వచ్చాయి.

ఎం.ప్రభాకర్, పశ్చిమగోదావరి

జాతీయ స్థాయి పతకం సాధించా



రోప్ స్కిప్పింగ్‌లో అండర్ 19 బాలికల విభాగంలో బంగారు పతకం సాధించాను. గత ఏడాది నాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో మొదటి బహుమతి, రాష్ట్ర స్థాయిలో 3బహుతులు సాధించాను. మా నాన్న చనిపోయారు మా అమ్మ సహకారంతో తునిలో ప్రభుత్వ హస్టల్‌లో ఉంటు పదవ తరగతి చదుతుతున్న పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి రోప్ స్కోపింగ్ లో మరింత రాణిస్తు డాక్టర్ కావాలన్నదే నా గోల్. మా పీడీ జయలక్ష్మి సహకారంతో ఈ పోటీలో విజయం సాధించాను.

వై.జ్యోతి, తుని

మా అమ్మ ప్రోత్సాహం



తుర్పు గోదావరి లో గుడిమళ్ళలంక జడ్పీ పాఠశాలలో 7వ తరగతి చదువు తున్నాను. అండర్ 14 బాలికల విభాగంలో మొదటి స్థానం సాధించాను. ఈ క్రీడలో రాణించాలని మా అమ్మ బాగా సహకరిస్తుంది. పోల్‌పై విన్యాసాలు చేస్తుంటే మా మిత్రులు ఆశ్చర్యంగా చూస్తారు. నన్ను ప్రత్యేకంగా చూస్తుంటే ఆనందంగా ఉంటుంది. మాల్కంబ్ పోల్ క్రీడలో ప్రావీణ్యం సాధించడానికి ప్రతీ రోజు 3 నుంచి 5 గంటలు కష్టపడతాను. దేశంలో మంచి క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా ఆశ.

కె.దేవి, తూర్పుగోదావరి

మాల్కంబ్ పోల్ పతకం సాధించా



మాల్కంబ్ పోల్ అండర్ 14 బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి బంగారు పతకం సాధించాను. చాలా మందితో పోటీ పడి మొదటి స్థానంలో నిలవడం చాలా ఆనందంగా ఉంది. ఈ క్రీడా ద్వారా శారీరకంగా పట్టుత్వం పెరుగుతుంది. ఈ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి పేరు తీసుకువస్తా.

డి.రోహిత్ కుమార్, భీమవరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా న్యాయాధికారులు

ఘనంగా న్యాయసేవాధికార సంస్థ దినోత్సవం

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ 9వ తేదీ నుంచి నేటి వరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థలు చేపట్టాయని అన్నారు. లోక్ అదాలత్‌లు నిర్వహించడం, చట్టాలపై ప్రజలకు అవగాహన, ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గత ఏడాది కాలంలో 7670 కేసులను రాజీ చేయడం జరిగిందని తెలిపారు. 155 మందికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేశామని, 716 న్యాయ విజ్ఞాన సదస్సులు, నిర్వహించామన్నారు. రెండవ అదనపు జిల్లా జడ్జి పి మంగాకుమారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేమింతే..దోచేస్తాం!

కలెక్టర్ తనిఖీ చేసినా మార్పులేదు

పలు ఇసుక ర్యాంపులలో కొనసాగుతున్న దోపిడీ

పాలకొల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు డివిజన్ పరిధిలోని పలు ఇసుక రీచ్‌లను శనివారం తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇసుక దోపిడిపై 'యథేచ్ఛగా ఇసుక దందా' శీర్షికన ఆంధ్రజ్యోతి పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం వార్త ప్రచురణ కావడం పాఠకులకు విధితమే. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి తీపర్రు, పెండ్యాల, జీడిగుంట ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు. అయితే తనిఖీల అనంతరం ఆయా ర్యాంపుల వద్ద ఇసుక ఎగుమతి నిర్ధీత ధర కంటే ఎప్పటి మాదిరిగా లారీకి రూ.5000 వసూలు చేస్తున్నట్టు పలువురు లారీ యజమానులు తెలిపారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీల అనంతరం పాత పద్ధతిలోనే వసూలు చేయడం సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది. జిల్లా స్థాయి అధికారులు, మైనింగ్ అధికారులను సైతం బేఖాతర్ చేస్తూ... అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్న దళారుల వెనక పెద్ద హస్తలే ఉండి ఉంటాయని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఉచిత ఇసుక విధానం నవ్వులపాలు అవుతుంటే, మరో వైపు ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగు తోందని కూటమి శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నాయి. ఇసుక దోపిడీపై రాష్ట్ర మంతా దృష్టి పెట్టి దళారులను అదుపు చేయాలని బిల్డర్లు, కాంట్రాక్టర్లు, వినియోగ దారులు కోరుతున్నారు.

ఆత్మ విశ్వాసమే ఆయుధంగా సాగాలి



మాట్లాడుతున్న డాక్టర్ రవికాంత్

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎన్ని సమస్యలు వచ్చినా విద్యార్థులు ఆత్మ విశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగాలని విశాఖ పట్నానికి చెందిన మానసిక వైద్యుడు డాక్టర్ బి.రవికాంత్ అన్నారు. నిట్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మీట్ యువర్ కౌన్సిలర్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో చోటు చేసుకుంటున్న ఎన్నో మార్పులతో పాటు చదువు, పరీక్షల కారణంగా కొంతమంది విద్యార్థులు తీవ్ర ఒత్తిడి, గందరగోళానికి గురవుతున్నారన్నారు. ఏ పని చేస్తున్నా ఏకాగ్రత లేకపోవడం, కోపం, చిరాకు, ఆందోళన వంటి అంతులేని నైరాశ్యానికి లోనవుతున్నారన్నారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతీ విద్యార్థి యోగా, వ్యాయామం, పరుగు, నడకకు ప్రతి రోజూ కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. పుస్తకాలు చదవడం, సంగీతం వినడం ద్వారా మెదడు చురుగ్గా పనిచేయడంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమాన్ని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్ పర్యవేక్షించారు.

పవర్ డిప్లమా సంఘం ఏలూరు, పశ్చిమ జిల్లాల కార్యవర్గం

ఏలూరుసిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఏలూరు సర్కిల్ సమావేశం శనివారం ఏలూరులో డీపీయూ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఈపీ డిస్కమ్ అధ్యక్షుడు కె.సత్యప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారు ఎ. సుబ్బారావు, రాష్ట్ర అధ్యక్షుడు వీవీ మహేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీ జోగి నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఏలూరు సర్కిల్ అధ్యక్షులుగా ఆర్.భీమేశ్వరరావు, కార్యదర్శిగా ఎ.సంజయ్ కుమార్, ట్రెజరర్‌గా ఎస్.శివకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బీఎస్ఆర్ఎన్ స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ (ఉమెన్)గా ఎ.రమాదేవి, బిల్డింగ్ సెక్రటరీగా కె.శివశంకరంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా సర్కిల్ అధ్యక్షులుగా ఎ.సతీష్, కార్యదర్శిగా పి. శ్రీనివాసరాజు, ట్రెజరర్‌గా ఆర్‌బీవీజీ రవి శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్. సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ (ఉమెన్)గా ఎ.సంఘ మిత్ర ఎన్నికయ్యారు.

19 నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అండర్-13 రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల బ్రోచర్లను పట్టణంలోని స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తనయుడు రాజేష్ ఆవిష్కరించారు. మాస్టర్ చెస్ అకాడమి ఛైర్మన్ సీహెచ్ వర్మ మాట్లాడుతూ చదరంగం పోటీలు ఈ నెల 19 నుంచి 21 వరకు స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయన్నారు. వివరాలకు అకాడమి కార్యదర్శి చంద్రశేఖర్‌ను (94408 67370) సంప్రదించాలన్నారు.

మృతుడి వివరాలు తెలపాలి



భీమవరం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్తిలి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి (35) విద్యుత్ స్తంభం ఎక్కి మృతి చెందిన విషయమై దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్‌ఐ రమణ తెలిపారు. మతిస్థిమితం సరిగా లేక ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నామని, మెన్ అని అక్షరాలు గల డ్రాయర్, ఆకుపచ్చదారంతో కుడి చేతికి తాయెత్తు ఉందని ఆచూకీ తెలిసిన వారు 94915 37226, 97056 49492 నంబరులో సంప్రదించాలని కోరారు.

గంజాయి రవాణా చేసింది వీరే..

దెందులూరు,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కలిగిన ఐదుగురు వ్యక్తులను దెందులూరు పోలీసులు శుక్రవారం రాత్రి సోమవరప్పాడులోని ద్వారకాప్లాట్స్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఐదుగురు నిందితుల పేర్లను శనివారం ప్రకటించారు. వారు విజయరాయి గ్రామానికి చెందిన కె.సుమంత్, ఏలూరుకు చెందిన నిఖిల్‌సాయి, సోమవరప్పాడుకు చెందిన జె.రోహిత్ గణేష్, తంగెళ్లమూడికి చెందిన రవివర్మ, ఏలూరు ఎటిగట్టుకు చెందిన రసూల్ బేగ్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

వరించిన అదృష్టం

(భీమవరం/నరసాపురం/ఏలూరు రూరల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు అమిత ప్రాధాన్యం ఇచ్చింది. రెండో విడత విడుదల చేసిన పదవుల్లో మూడు కీలక పదవులను కేటాయించింది. సీనియారిటీ, విధేయతకు పెద్దపీట వేసింది. జిల్లాకు మూడు పదవులు కట్టబెట్టింది. శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, కనకరాజు సూరిలకు కీలక పదవులు వరించాయి. తెలుగుదేశం ఇన్‌చార్జిలకు ఎటువంటి పదవులు ఇవ్వలేదు. ప్రభుత్వం వ్యూహాత్మకంగానే ఇన్‌చార్జిలకు పదవులు ఇవ్వలేదన్న అభిప్రాయం ఉంది. ఇన్‌చార్జిలకు ఇతర పదవులు ఇవ్వాలన్న తలంపుతో ఉంది. ఇప్పటికే అధిష్ఠానం వద్ద కొందరు ఇన్‌చార్జిలు తమ మనోగతాన్ని వెల్లడించారు. అందులో భాగంగానే రెండో విడత నామినేటెడ్ పదవులు కేటాయించలేదు. జిల్లాలో తొలి వరుసలో తెలుగుదేశం ఇన్‌చార్జిలు తోట సీతారామలక్ష్మి, వలవల బాబ్జి, పొత్తూరి రామరాజులున్నారు. తొలి నుంచీ టిక్కెట్ భరోసా ఇచ్చి ఇవ్వలేకపోయామంటూ బాబ్జిపై అధిష్ఠానం ఇప్పటికే మల్లగుల్లాలు పడుతోంది. అలాగే తోట సీతారామలక్ష్మి విషయంలో ఇప్పటికే పార్టీలో కీలకమైన పొలిట్‌బ్యూరో బాధ్యతలు అప్పగించింది. ఇక నర్సాపురం ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుకు పదవి ఇచ్చేలా కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. రెండో విడత నామినేటెడ్ పదవుల కేటాయింపులో తెలుగుదేశం, జనసేనకు బెర్త్‌లు వరించాయి. మైనారిటీ వ్యవహారాల విభాగంలో ప్రభుత్వ సలహాదారుగా శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్‌ను నియమించింది. తొలి నుంచీ తెలుగుదేశం పార్టీకి షరీఫ్ విధేయతగా ఉంటున్నారు. 1982 టీడీపీ జెండాను నరసాపురంలో ఎగర వేసినవారిలో షరీఫ్ ఒకరు. లా చదివి, టీడీపీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. అప్పటి నుంచి పార్టీలో కొనసాగుతూ పార్టీలో అనేక పదవులు నిర్వహించారు. పార్టీ ఒడిదుకుల్లోనూ అంటిపెట్టుకుని ఉన్నారు. వివాద రహితునిగా, పార్టీ విధేయునిగా షరీఫ్‌కు మంచి పేరుంది. విధేయత చూపిన వారికి పెద్దపీట వేస్తామన్న సంకేతాలను తెలుగుదేశం అధిష్ఠానం కేడర్‌కు పంపింది. ఇదివరకే ఉండి మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు రామరాజుకు ఏపీఐఐసీ ఛైర్మన్‌గా నియమించారు. టిక్కెట్ వదులుకున్న రామరాజుకు ఇప్పటికే తెలుగుదేశం పెద్దపీట వేసింది. మాజీ మంత్రి పీతల సుజాతకు రాష్ట్ర వినియోగదారుల రక్షణ కౌన్సిల్ ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. పోలవరం నేత బొరగం శ్రీనివాస్‌కు ఏపీ ట్రైకార్ ఛైర్మన్ పదవి ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెండో విడతలో జనసేనలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కనకరాజు సూరికి పదవి వరించింది. గతంలో ఆయన ప్రజారాజ్యం తరపున భీమవరం నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. అప్పట్లో పవన్ కల్యాణ్ ఆశీస్సులతోనే భీమవరం టిక్కెట్ దక్కించుకున్నారు. ఓటమి తర్వాత ఆయన ఏ పార్టీకి చేరువకాలేదు. పవన్ కల్యాణ్‌తో సన్నిహితంగా ఉంటూ వస్తున్నారు. జనసేన పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కనకరాజు సూరికి ప్రత్యేకంగా భరోసా ఇచ్చారు. ఇప్పుడు మాట నిలబెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ బాధ్యతలను అప్పగించారు.

కూటమిలో రెండో సారి

కాపు కార్పొరేషన్ పదవి రెండో సారి జిల్లాకు వరించింది. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో తొలిసారి కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన మొదటి ఛైర్మన్‌గా కొత్తపల్లి సుబ్బారాయుడు నియమితులయ్యారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకే రెండో సారి కాపు కార్పొరేషన్ పదవి వరించింది. జనసేనలో కొత్తపల్లి చేరినప్పుడే పవన్ కల్యాణ్ నుంచి హామీ లభించింది. అందుకు తగ్గట్టుగానే కార్పొరేషన్ ఛైర్మన్ బాధ్యతలను కూటమి పంపకాల్లో కొత్తపల్లి సుబ్బారాయుడుకు కేటాయించారు. రుస్తుంబాదా ప్రాంతానికి చెందిన ప్రాంతానికి 1983లో స్వతంత్ర అభ్యర్థిగా మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి నుంచి రాజకీయ ప్రస్థానం మొదలైంది.

పదవులు ఆశించే వారెందరో

ఇంకా జిల్లాలో ప్రధాన పదవులను ఆశించే నాయకులు ఉన్నారు. ఆ వరుసలో భీమవరం నుంచి మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావు, తణుకు నుంచి దొమ్మేటి సుధాకర్, నర్సాపురం నుంచి మాధవ నాయుడు వంటి నాయకులకు తెలుగుదేశం కూటమి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. నాయకులు ఇప్పటికే అధిష్ఠానం వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేశారు.



ఛైర్మన్ పదవులు దక్కించుకున్న షరీఫ్, రెడ్డి అప్పల నాయుడు, కొత్తపల్లి, కనకరాజు సూరి

పదవికి వన్నెతెస్తా: రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు రూరల్: సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనకు అప్పగించిన పదవికి వన్నెతెస్తానని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ ఛైర్మన్‌గా ఎంపికైన ఏలూరు జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిఅప్పల నాయుడు అన్నారు. ఏలూరు మార్కెట్ యార్డులో హమాలీగా చేరి ఆ తర్వాత ఏలూరు వెంకటాపురం సర్పంచ్‌గా గెలుపొంది రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2019లో జనసేనపార్టీ నుంచి ఏలూరు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2024లో ఏలూరు ఎమ్మెల్యే సీటు ఆశించారు. కూటమిలో భాగంగా బడేటి చంటికి టికెట్ కేటాయించారు. అప్పట్లో రెడ్డిఅప్పలనాయుడు కొంత అసంతృప్తిని వ్యక్తం చేశారు. అప్పట్లో పార్టీ అధిష్ఠానం అప్పలనాయుడుకు భవిష్యత్‌లో ఉన్నత పదవులు ఇస్తామని ఇచ్చిన హామీలో భాగంగానే ఆర్టీసీ విజయవాడ రీజయన్ ఛైర్మన్‌గా నియమించారు.

ఉమ్మడి పశ్చిమలో నలుగురికి నామినేటెడ్ పదవులు

ప్రభుత్వ సలహాదారుగా షరీఫ్

కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొత్తపల్లి సుబ్బారాయుడు

క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కనకరాజు సూరి

ఆర్టీసీ విజయవాడ జోన్ ఛైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడు

తొలి విడతలో నాలుగు.. తాజాగా నాలుగు పదవులు

పాలకొల్లు టీడీపీ శ్రేణుల్లో నిరాశ

పాలకొల్లు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల 2వ జాబితాను విడుదల చేసిన నేపథ్యంలో 59 మందికి రాష్ట్ర వ్యాప్తంగా పదవులు లభించినప్పటికీ పాలకొల్లు నియోజక వర్గానికి ఒక్క పదవి రాకపోవడం పట్ల టీడీపీ శ్రేణులు నిరాశగా ఉన్నాయి. టీడీపీ హయాంలో గత 40 ఏళ్ళుగా పాలకొల్లు నియోజక వర్గంలో పార్టీకి వెన్నంటి ఉన్న వారు ఎందరో ఉన్నారు. నామినేటెడ్ పోస్టుల తొలి జాబితాలోనూ, మలి జాబితా లోనూ పాలకొల్లు నియోజక వర్గానికి చోటు లభించకపోవడంతో నామినేటెడ్ పదవులు ఆశించిన నాయకులు డీలా పడ్డారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌కు మాత్రం రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు తప్ప మరొకరికి కనీసం నామినేటెడ్ పదవీ కూడా టీడీపీ అధిష్ఠానం ఇవ్వకపోవడం సముచితంగా లేదని సీనియర్ నాయకులు పెదవి విరుస్తున్నారు.

క్రైమ్ కార్నర్

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



ముసునూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో కౌలురైతు కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గోగులంపాడుకు చెందిన చెన్ను రాజా రావు(38) నాలుగేళ్లుగా సుమారు 7ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ప్రతి ఏటా కౌలు వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పులపాలై తీర్చేదారిలేక కొన్ని నెలలుగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఎక్కువ మద్యం సేవించి, పొలానికి వెళ్ళిన రాజారావు మద్యం మత్తులో కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పాడు. రాజారావును నూజివీడు అమెరికన్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.



వైసీపీ సోషల్ మీడియాపై ఫిర్యాదు

ఆచంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా ముసుగులో పోస్టులు పెడుతున్న వైసీపీ గుండాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆచంట నియోజకవర్గ టీడీపీ యువనాయకుడు సిర్రా బాలాజీ శనివారం ఫిర్యాదు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోమ్ మంత్రి అనితలపై అనుచిత, అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెనుగొండ సీఐ రాయుడు విజయ కుమార్, ఆచంట ఎస్‌ఐ కె. వెంకట రమణకు ఫిర్యాదు చేసినట్లు బాలాజీ తెలిపారు.

లారీ కింద పడి విద్యార్థిని మృతి



పల్లవి(ఫైల్)

కైకలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను కోల్పోయిన ఆమె బాబాయి దగ్గర పెరుగుతూ 9వ తరగతి చదువుతోంది. అయితే విధి చిన్నచూపు చూడడంతో ప్రమాదవశాత్తూ లారీ కింద పడి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కైకలూరులోని కోరుకొల్లు రోడ్డులో తల్లిబోయిన దుర్గారావు నివసిస్తుండగా అతని సోదరుడు వెంకన్న, వదిన మణి అనారోగ్యంతో సుమారు పదేళ్ల క్రితం మృతి చెందారు. దీంతో వారి కుమార్తె పల్లవి (16)ని దుర్గారావు దంపతులు పెంచుకుంటున్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. దుర్గారావు స్థానిక ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తుంటాడు. పల్లవికి తల్లిదండ్రులు లేరన్న బాధ లేకుండా ఆమెను తమ సొంత కూతురులా అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. పల్లవి కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆమె స్థానిక టౌన్‌హాలు సమీపాన ఉన్న ట్యూషన్ సెంటర్‌కు ప్రతీ రోజూ వెళ్లి వస్తుంది. శనివారం సాయంత్రం ట్యూషన్ నుంచి ఇంటికి సైకిల్‌పై తిరిగి వెళ్తూ కుమారి థియేటర్ వద్ద ప్రమాదవశాత్తూ లారీ కింద పడి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె బాబాయి, పిన్ని ఇతర కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహం వద్ద బోరున విలపించారు. టౌన్ ఎస్‌ఐ వెంకట్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనుమలకు రక్షణ కల్పించండి

జగన్నాథపురంలో హత్యకు గురైన మహిళ తండ్రి ఆవేదన





నిరసన తెలుపుతున్న మృతురాలి బంధువులు (ఇన్‌సెట్‌లో) న్యాయం కోసం వేయించిన బ్యానర్

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోడలిని లైంగికంగా వేధిస్తూ ఆమెను రోకలిబండతో హతమార్చిన మామ నుంచి తమ మనుమలను కాపాడాలని మనుమలు, బంధువులతో హతురాలి తండ్రి జగన్నాథపురంలో నిందితుల ఇంటి ముందు నిరసన చేపట్టాడు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరు నెలల క్రితం లక్కోజు కేశవరావు కుటుంబ సభ్యులతో కలిసి కోడలు నాగశ్రావణిని రోకలిబండతో హత్య చేశారు. నాగశ్రావణి కుమారుడు నిశాంత్, కుమార్తె భవ్యికల ప్రాణాలకు ముప్పు ఉందని నాగశ్రావణి తండ్రి మేడూరి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీనిపై పోలీసులను ఆశ్రయించినా రూరల్ సీఐ నిందితుల తరపున మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి గ్రామస్థులే తమకు న్యాయం చేయాలంటూ నిందితుల ఇంటి ముందు టెంట్ వేసి నిరసనకు దిగారు.

వ్యాపారికి బురిడీ

యాప్‌లో రూపాయి కొట్టమని రూ.50వేలు కొట్టేశాడు!

నరసాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌పేలో రూపాయి కొడితే మీకు ఇవ్వాల్సిన బాకీ మొత్తం మా యాజమాని కొడతాడని నమ్మించి ఓ కేటుగాడు రూ.50వేలు కొట్టేశాడు. నరసాపురం పట్టణంలోని మొగల్తూరు రోడ్‌లో శ్రీ దుర్గా బిల్డింగ్ మెటీరియల్ దుకాణంలో శనివారం ఈ సంఘటన జరిగింది. దీనికి సంబంధించి దుకాణ యాజమాని ఆచంట గోపాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా. ఉదయం దుకాణం తెరవగానే ఒక యువకుడు వచ్చాడు. ముందు 20 బస్తాల సిమెంట్ అడిగాడు. బేరం ఆడాడు. తగ్గించి మొత్తం ఎంత అవుతుందో లెక్కగట్టి చెప్పమన్నాడు. వ్యాపారి దీన్ని లెక్కగట్టి చెప్పగా ఓ నెంబర్ చెప్పి మీ ఫోన్ నుంచి రూపాయి కొట్టండి.... మా యాజమాని ఆ నెంబర్‌కు సొమ్ము వేస్తాడని నమ్మించాడు. అదే సమయంలో వ్యాపారి కొడుతున్న పిన్ నెంబర్‌ను గమనించాడు, కేటుగాడు చెప్పిన నెంబర్‌కు రూపాయి వెళ్లలేదు. ఈ విషయాన్ని వ్యాపారి చెప్పగానే ఏది నేను చూస్తానని ఫోన్ తీసుకున్నాడు. అదే సమయంలో 28 బస్తాలకు ఎంత అవుతుందో లెక్కగట్టమన్నాడు. దుకాణదారుడు దీన్ని లెక్కిస్తున్న సమయంలో తన ఫోన్ తీసి యాజమాని స్కానర్ ఓపెన్ చేసి ఖాతాలో ఉన్న రూ.50,400 కొట్టేశాడు. మళ్లీ ఏమి తెలియనట్లు దుకాణ దారుడికి ఫోన్ ఇచ్చేసి నేను డబ్బులు పట్టుకొస్తానని నమ్మించాడు. అయితే అతను వెళ్లగానే ఫోన్ చెక్ చేసుకుంటే ఖాతాలో సొమ్ము లేదు. వెంటనే బయటకొచ్చి చూస్తే... కేటుగాడు కనిపించ లేదు. వెంటనే పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు గోపాలకృష్ణ చెప్పారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

పెదవేగి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రాకతో ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలో శనివారం పలువురు ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలనలో ఐదేళ్లపాటు ప్రజలు అష్టకష్టాలు పడ్డారన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టి, ముందుకు నడిపిస్తున్న కూటమి ప్రభుత్వం భవిష్యత్‌లో మరింత సమర్థవంతమైన, సంక్షేమ పాలన అందిస్తుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు, సులేమాన్ పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయునికి విశేష అష్టోత్తర పూజలు



జడ్జి రాజశేఖర్‌కు ప్రసాదాలు అందజేస్తున్న ఈవో

జంగారెడ్డిగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయనేయ స్వామికి శనివారం విశేష అష్టోత్తర పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వివిధ సేవల రూపంలో దేవస్థానానికి రూ.2 లక్షల 31 వేల 749 లు ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. తెనాలి సీనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్ కుటుంబ సమేతంగా ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో చందన ఆయనను స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో కృష్ణారావు ప్రతిభ



దెందులూరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా జట్టు విజయం సాధించింది. విజయవాడలో శనివారం జరిగిన జాతీయ సవిల్ సర్వీస్ ఉద్యోగుల ఆటల పోటీల్లో దెందులూరు మండలం పోతునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఎం.కృష్ణారావు ప్రతిభ కనబర చడం తో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో విజేతగా నిలిచా రు. కృష్ణారావును పలువురు అభినందించారు.

'అంబళ్ల' విగ్రహావిష్కరణ

నిడమర్రు నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు అంబళ్ళ వెంకటేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అంబళ్ళ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై నిరసన

ఏలూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాదేపల్లి ఇందిరమ్మకాలనీలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలని శనివారం ఆ ప్రాంత మహిళలు, స్థానికులు ఆందోళన చేశారు. పలువురు మహిళలు మాట్లాడుతూ సెల్ టవర్ నిర్మాణం జరిగితే రేడియేషన్ వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయనే భయాందోళనలో ప్రజలు ఉన్నారన్నారు. తక్షణమే సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందచేస్తామని పేర్కొన్నారు.

లో ఓల్టేజి సమస్యపై సమీక్ష



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపురం మెట్ట ప్రాంతంలో ఉన్న ప్రత్యేక మంచినీటి పథకానికి లో ఓల్టేజి సమస్య రావడంతో శనివారం సంబంధిత శాఖ డీఈ కేఎం అంబేద్కర్‌తో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సమీక్షించారు. సమస్య పరిష్కరించాలని సూచించారు.

అథ్లెటిక్స్‌లో డింపుల్ మహాశ్రీకి బంగారు పతకాలు



ఏలూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ -17 బాలికల రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఏలూరు క్రీడా కారిణి లక్కోజు డింపుల్ మహాశ్రీ ప్రతిభ కనబరిచి 100 మీటర్లలో బంగారు పతకం, 200 మీటర్లలో వెండి, 4-100 మీటర్ల పరుగులో బంగారు పతకాలు సాధించి, పతకాల వేటలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రతిభ కనబరిచిన డింపుల్ మహాశ్రీ లక్నోలో త్వరలో జరిగే 39వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొననుంది. ఆమె తమిళనాడు యూనిక్ స్పోర్ట్స్ అకాడమి కోచ్ బి.వేలుము రగన్ వద్ద శిక్షణ పొందుతోంది.

ఆదమరిస్తే.. అంతే సంగతి

» ప్రమాదకరంగా కల్వర్టు » పట్టించుకోని అధికారులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న సంత మార్కెట్‌లోకి వెళ్ళే ప్రధాన రహదారి డ్రైన్ పైఉన్న సిమెంట్ కల్వర్టుకు పెద్ద రంధ్రాలు పడి, ఇనుప ఊచలు పైకి లేచి శిథిలావస్థకు చేరుకుంది. ఈ కల్వర్టుపై నుంచి సంతలోకి వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఆదమరిచి వేళ్తే ఇక అంతే సంగతి. ప్రతి సోమ, శనివారం ఉదయం ఇక్కడ జరిగే కూరగాయల మార్కెట్‌కు వందలాది మంది రైతులు, వ్యాపారులు వస్తారు. ప్రతి గురువారం ఉదయం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకు సంత జరుగుతుంది. ఈ సంతకు జంగారెడ్డిగూడెం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పట్టణ ప్రజలు వందల సంఖ్యలో వస్తారు. రాకపోకలన్నీ ఈ వైపు నుంచే అధికంగా ఉండడంతో ప్రమాద భరితంగా ఉన్న ఈ కల్వర్టు గుండానే రాకపోకలు సాగిస్తారు. రాత్రి పూట చీకటిలో వచ్చేవారు ప్రమాదబారిన పడే అవకాశాలు అధికంగా ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్నా ఈ కల్వర్టును అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సంత మార్కెట్ ద్వారా మున్సిపాలిటీకి లక్షల్లో ఆదాయం వస్తున్నా సంత మార్కెట్‌లో కనీస మౌలిక సదుపాయాలు కలిపించడంలేదని పలువురు వ్యాపారులు, ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి సంత మార్కెట్ లోకి వెళ్ళే ప్రధాన రహదారి కల్వర్టును త్వరితగతిన నిర్మించి ప్రమాద బారినుంచి కాపాడాలని ప్రజలను కోరుతున్నారు.



మున్సిపల్ కార్యాలయం పక్కనే శిథిలమై ప్రమాదకరంగా ఉన్న సంత మార్కెట్ కల్వర్టు

బడ్జెట్‌లో పీఆర్సీకి నిధులు కేటాయించాలి

ఏలూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఈ నెల 11న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో పీఆర్సీకి నిధులు కేటాయించాలని, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని శనివారం ఏలూరులో జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సమగ్ర శిక్ష ద్వారా ఇస్తున్న అన్ని రకాల శిక్షణలను ఇకమీదట మండల కేంద్రాలకే నాన్-రెసిడెన్షియల్ పద్ధతికి పరిమితం చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర మాట్లాడుతూ 'అపార్' డేటా నమోదుకు టీచర్లపై ఒత్తిళ్లు తెచ్చి మానసిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 'అపార్' నమోదు గడువు వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు ఎస్కే రంగావలి, సంఘ నాయకులు టి.ప్రకాష్, కుటుంబరావు పాల్గొన్నారు.

ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించండి

ఎన్నికల విధుల్లో పాల్గొన్న టీచర్లకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మకు పీఆర్టీయూ జిల్లా నాయకులు ఆంజనేయులు, సుబ్బారావు తదితరులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది వేసవి సెలవుల్లో హైస్కూళ్లలో విధులు నిర్వహించిన హెచ్‌ఎంలకు, టీచర్లకు, సిబ్బందికి, పదో తరగతి పరీక్షల స్పాట్ వాల్యూయేషన్, ఇన్విజిలేషన్ డ్యూటీలు చేసిన వారికి సంపాదిత సెలవులను ఇప్పించాలని కోరారు. టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించిన ఉపాధ్యాయులకు కాంపెన్సేటరీ లీవులను మంజూరు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు రాంబాబు, మురసలీన్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సాగు భూములకు హక్కు పట్టాలివ్వాలి



మహాసభలో మాట్లాడుతున్న సీతారామ్

బుట్టాయగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు సాగు చేస్తున్న ఎల్‌టీఆర్, 1/70 చట్టం భూములకు హక్కు పట్టాలివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెడ్డిగణపవరంలో టి.ముత్యాలమ్మ, వి.వీరయ్య, పి.నాగేశ్వరావు అధ్యక్షతన శనివారం జరిగిన 8వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కొమరం బాబురావు స్మారక స్థూపం వద్ద కోర్స జలపాలు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్‌ఎస్ నగర్ వరకు ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టుకు ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్నా సర్వం కోల్పోయి నిరాశ్రయులైన నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని సీతారాం మండిపడ్డారు. ఏజెన్సీలో విద్యా, వైద్యానికి ప్రభుత్వం అధిక నిధులు ఇవ్వాలని, మారుమూల ప్రాంతాల్లో బడులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎ.రవి, టి.రామకృష్ణ, ఎం.నాగమణి, యు.వెంకటేష్, కె.శ్రీను, కె.భాస్కర్, సీహెచ్ బుల్లెమ్మ, ఎం.పోశమ్మ, ఎం.నరేంద్ర, పి.రాజు ఆదివాసీలు పాల్గొన్నారు.

సొత్తు రికవరీ.. బాధితులకు అందజేత



బాధితులకు నగదు అందజేస్తున్న భీమడోలు సీఐ విల్సన్

భీమడోలు, నవంబరు 09 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు జంక్షన్‌లో ఇటీవల జరిగిన చోరీ ఘటనలో నిందితుల నుంచి రికవరీ చేసిన చోరీ సొత్తును కోర్టు ఆదేశాల మేరకు భీమడోలు పోలీసులు శనివారం బాధితులకు అందజేశారు. సెప్టెంబర్ 18న ద్వారకాతిరుమల మండలం గుండంపల్లి గ్రామానికి చెందిన చిరు వ్యాపారి తుమ్మలపల్లి మహేశ్వరరావు భీమడోలు జంక్షన్ స్టేట్ బ్యాంకులో రూ.మూడు లక్షలు విత్‌డ్రా చేశారు. ఆ సొమ్మును బ్యాగ్‌లో భద్రపరిచి మోటారు సైకిల్ తగిలించుకుని వెళ్తుండగా సొమ్ము దొంగిలించబడింది. దీనిపై ఫిర్యాదు అందుకున్న భీమడోలు సీఐ విల్సన్, ఎస్‌ఐ సుధాకర్ అదే నెల 23న నిందితులను అరెస్టు చేసి రూ.రెండు లక్షల 80 వేలను రికవరీ చేశారు. ఈ మేరకు భీమడోలు సర్కిల్ కార్యాలయంలో బాధితులకు ఆ సొమ్మును అందజేశారు.

గొట్టుముక్కలకు శుభాకాంక్షలు



ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్ అడ్వజరీ కమిటీ కన్వీనర్‌గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన గొట్టుముక్కల రఘురామరాజును ఆయన స్వగృహంలో ఏలూరు జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ఆర్ లక్ష్మీనారాయణ రాజు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తలదాచుకోవడానికే జనసేనలో చేరుతున్నారు



సైదు గోవర్ధన్

ఏలూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు తలదాచుకోవడానికే జనసేనలో చేరుతుంటే ఏలూరు రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఖండించలేని పరిస్థితిలో ఉన్నారని, అతని కారణంగా కొల్లేరులో టీడీపీ నాయకులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని, కొల్లేరు నాయకులు శ్రీపర్రు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సైదు గోవర్ధన్ ఆరోపించారు. విలేకర్ల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ తాను ఐదేళ్ల పాటు వైసీపీని ఎదురించి ఆస్తులు పోగొట్టుకుని పోలీస్ కేసులు పెట్టుకున్నా బెరవ లేదన్నారు. వైసీపీ మద్దతుదారులకు ప్రస్తుతం నాగరాజు సహకరిస్తున్నాడని ఆరోపించారు. మండల అధ్యక్ష పదవిని కొల్లేరు, లంక గ్రామాల్లో ఉన్న నాయకులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో నాగరాజు చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. నంబూరి నాగరాజును పార్టీ నుంచి తొలగించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేకి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఏటీఏ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు

బుట్టాయగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ టీచర్స్ అసోషియేషన్(ఏటీఏ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరావు అధ్యక్షతన శనివారం మండల విద్యా శాఖ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు మాట్లాడుతూ సంఘం ఏర్పడిన 12 సంవత్సరాల్లో షెడ్యూల్డ్ ప్రాంత ఉపాధ్యాయులకు అనేక విజయాలు సాధించి పెట్టడం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నూరుశాతం ప్రమోషన్లు, జీవో నెం.3 రద్దు కావడంతో సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయడం, ఆదివాసీ ఉపాధ్యాయుల జీవోలు, చట్టాలు అమలుపరచడానికి సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. పీఆర్సీ ఆలస్యం అవుతున్న కారణంగా ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, ఉద్యోగులకు రావలసిన పెండింగ్ బకాయిలు, ఏడీలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెం.3 చట్టబద్ధత కోసం షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని అందుకు గిరిజన సలహా మండలి చొరవ తీసుకోవాలని కోరారు. ఏటీఏ చేస్తున్న కృషిని ఎంఈవో-2 ఎస్.బుచ్చియ్య అభినందించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏటీఏ బి.గోపిమూర్తికి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. నాయకులు టి.రాములు, కె.రమేష్, ఎస్.రాజు, టి.గంగరాజు దతితరులు పాల్గొన్నారు.

కారుమూడి వర్ధంతి



కె.కోట కారుమూడికి సీపీఐ నాయకుల నివాళి

చింతలపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంటపల్లిలో కారుమూడి సత్యనారాయణ రెడ్డి 28వ వర్ధంతి సభ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కారుమూడి పోరాట విశేషాలను పలువురు వివరించారు. జిల్లా కార్యదర్శి ఎంకే చైతన్య, పి.సోమశేఖరాచార్యులు, టి.బాబు, ముత్తారెడ్డి పాల్గొన్నారు.

● కామవరపుకోట : పేదల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిన దివంగత నేత కారుమూడి సత్యనారాయణ రెడ్డి సేవలు ప్రశంసనీయమని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కారుమూడి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.నాయకులు జి.సత్యనారాయణ, టి.రాములమ్మ, సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.దుర్గా రావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభ

ఏలూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభ శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను కాషాయికరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సంఘ కోశాధికారి సాయికుమార్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

జంగారెడ్డిగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఎక్సైజ్‌శాఖ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఉన్న నేర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. సారా, అనధికార మద్యం అమ్మకాలు, సరిహద్దు రాష్ట్రం నుంచి సుంకం చెల్లించని మద్యం అమ్మకాలు ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆవులయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పాండురంగారావు, సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్, జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.

హెల్మెట్ లేకుంటే చర్యలు

లింగపాలెం,నవంబరు9,(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న వాహనదారులకు సూచించారు. ధర్మాజీగూడెంలో శనివారం వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలకు పత్రాలు ఉండాలన్నారు. లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అసభ్యంగా పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోండి

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను, వైకాపా ముఖ్య నేతలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు, దుష్ప్రచారాలకు పాల్పడుతున్న తెలుగుదేశం పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ నాయకులు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, పలు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఎంపీపీ అప్పారావు, జయప్రకాష్, విజయరాజు తదితరులు శనివారం ఏలూరు ఎస్పీ కార్యాలయానికి వచ్చి అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ సోషల్ మీడియాకు అండగా ఉంటామన్నారు. అదే విధంగా తెలుగు దేశం సోషల్ మీడియా కార్యకర్తలు జగన్మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై తీవ్ర పదజాలంతో అనుచిత పోస్టింగ్‌లు పెడుతున్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఆయన ప్రశ్నించారు. వారిపై కూడా చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కట్టడి చేయాలని కోరారు.

నేడు విజయవాడలో వార్షికోత్సవ సమావేశం

ఏలూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం వార్షికోత్సవం ఆచార్య చంద్రపాటి అధ్యక్షతన ఆదివారం విజయవాడ యనమల కుదురులోని శ్రీనివాసా నిలయం చారిటీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు పీఠం ప్రధాన సంచాలకులు ఎ.శివశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణ యజుర్వేదీయ విశ్వకర్మసూక్తం పుస్తకాన్ని ఆవిష్కరించటం జరుగుతుందన్నారు. 50 ఏళ్ల ధర్మపీఠ ప్రస్థానం, విభజన అనంతరం నవ్యాంధ్రలో ధర్మపీఠం పునఃప్రారంభం చేపట్టిన కార్యక్రమాలు తదితర వాటి పై సమీక్ష జరుగుతుందన్నారు.

'డి'విటమిన్ లోపంతోనే ఎముకల వ్యాధులు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీకృష్ణ

ఏలూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విటమిన్ 'డి' లోపం కారణంగా చిన్న వయస్సు లోనే ఎక్కువ మందికి ఎముకల సాంద్రత తగ్గి పోతోందని, బోన్ డెన్సిటీకి గురవుతున్నారని, ప్రముఖ ఆర్థో వైద్యులు శ్రీకృష్ణ అన్నారు. ఆర్ఆర్ పేట లోని ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహించారు. ఎక్స్‌రే, బీపీ షుగర్, బోన్‌డెన్సిటీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిం చారు. ప్రస్తుతం అపార్ట్‌మెంట్ కల్చర్ ఎక్కువ కావడం వల్ల సూర్యకిరణాలు తాకడం లేదని, ఫలి తంగా 'డి' విటమిన్ లోపించి చిన్నవ యస్సులో నే ఎముకల వ్యాధుల బారిన పడుతున్నారన్నా రు. మహిళలకు ఇది ఎక్కువగా వస్తుందని అన్నారు.

102 మందికి వైద్య సేవలు

ఏలూరు కార్పొరేషన్. 9 నవంబరు (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అగ్రహారంలోని గీతా భవనం వద్ద శనివారం ఏర్పాటు చేసిన ఉచిత ఆ యుర్వేద వైద్య శిబిరంలో ఆయుష్ వైద్యాధికారి బీవీఎం నగేష్, బృందం 102 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. లయన్స్ నాయకులు ఎం.రామారావు, ఎస్.లక్ష్మీనరసింహారావు, సీహెచ్.వెంకట్రామయ్య, పి.పండరీనాథ్, బి.సురేష్ పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే చేయాలి

లింగపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది ప్రతిరోజూ గ్రామాలలో పర్యటించాలని ఫీవర్ సర్వే చేయాలని డాక్టర్ సంధ్యారాణి అన్నారు. శీతాకాలంలో ఊపిరితిత్తుల నిమ్ము ఉన్నవారు చలిగాలులలో తిరగకూడదని, చల్లని పదార్థాలు, కూల్‌డ్రింక్స్ లాంటివి తాగకూడద న్నారు. ఆమెతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఏలూరు సర్వజన ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎంఎస్ రాజు అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలు, అక్కడ సౌకర్యాల పై అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్‌లు చేసినందుకు డబ్బులు అడుగుతున్నారా, ఉచితగా చేస్తున్నారా అని అడిగారు. సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలని చర్యలు తీసుకుంటానన్నారు.

ఆరోగ్య సమస్యలపై సూచనలు

భీమడోలు, నవంబరు 09 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య సర్వేకల్ కేన్సర్‌పై వైద్యులు బాలజ్యోతి అవగాహన కల్పించారు. శ్రీమాధురి జూనియర్ కళాశాల బాలికల క్యాంపస్‌లో ఆరోగ్య మాత జనరల్ ఆస్పత్రి వైద్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ కేసరి, ఇన్‌చార్జి బాలు, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాలు అమలు చేయాలి



ప్రజాపోరు యాత్రలో మాట్లాడుతున్న నేతలు

ఏలూరు కార్పొరేషన్. 9 నవంబరు (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలలో కూటమి నేతలు ప్రజలకిచ్చిన హామీలు అ మలు చేయాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అన్నారు. ఏలూరు నగరంలోని పలు డివిజన్లలో సీపీఎం శనివారం ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. నాయకులు ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు కావడంలేదని తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బెల్టు షాపులు నిర్మూలించాలని, ఉచిత ఇసుక సక్రమంగా అమలుచేయాలని కోరారు. నాయకులు బి.జగన్నాధరరావు, ఎం.అరుణకుమారి, ఎ.శ్యామలరాణి, జి.శారద, ఏసుబాబు, ఎం.ఇస్సాకు, జె.గోపి, ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కాపర్ వైర్ చోరీ

టి.నరసాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని సింగరాయపాలెం పొలాల్లోని హైమావతి, బాబురావుకు చెందిన 40 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని సుమారు రూ.5 వేలు విలువ గల కాపర్ వైరును అపహరించినట్లుగా బొర్రంపాలెం విద్యుత్ శాఖ ఏఈ శ్రావణ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈవ్ టీజింగ్‌పై కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒక యువతి మొబైల్‌కు ఒక యువకుడు అసభ్యకరమైన మెస్సేజ్‌లు పెట్టడంతో ఆ యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఆదివారపుపేటకు చెందిన ఒక యువతిని ఏలూరు చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన పవన్‌కల్యాణ్ అనే యువకుడు వేధింపులకు గురి చేస్తూ ఆమె మొబైల్‌కు అసభ్యకరమైన మెస్సేజ్‌లు పెడుతున్నాడు. ఆ యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు పవన్‌కల్యాణ్‌పై ఈవ్ టీజింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు పట్టారు.

బెల్లపు ఊట ధ్వంసం

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామని ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వారం రోజులుగా నిర్వహించిన దాడుల్లో 95 కేసులు నమోదు చేసి 78 మందిని అరెస్టు చేశామన్నారు. వీటిలో 30 సారా కేసుల్లో 99 లీటర్ల సా రా స్వాధీనం చేసుకుని, 13 మందిని అరెస్టు చేశామన్నారు. బెల్లం ఊట కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేసి 17,850 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. మద్యం అమ్మకాలు చేస్తున్న 65 మందిని అరెస్టు చేసి, 400.20 లీటర్ల మద్యాన్ని 64.35 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండు వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

బస్సు ఢీకొని..

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై నిలబడి ఉన్న ఒక వ్యక్తిని ప్రైవేటు బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా భూర్జీ మండలం గుత్తా గ్రామానికి చెందిన విశ్రాంత సీటీవో సగపలా సీతారామమూర్తి(50), భార్య, కుమారుడు, కుమార్తె శనివారం సాయంత్రం విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకుని, తిరిగి శనివారం రాత్రి తమ గ్రామానికి కారులో బయలుదేరారు. మార్గ మధ్యలో ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్ గేట్ దగ్గరలో ఉన్న ఒక డాబా వద్ద టిఫిన్ చేశా రు. రామ్మూర్తి తన కారు వద్దకు వచ్చి నిలబడి ఉన్నారు. అంతలో విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఒక బస్సు అతివేగంగా వెళ్ళుతూ రామ్మూర్తిని ఢీకొని వెళ్లిపోయింది. తీవ్ర గాయాల పాలైన రామ్మూర్తిని వారి కారులోనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారిం చారు. ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చే సి అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద..

ఆస్పత్రి వైద్యానికి వచ్చిన ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరులోని ఆదివారపుపేటనకు చెందిన పఠాన్ షాకీర్ (32) అనారోగ్యానికి గురికాగా ఏలూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాడు. చికిత్స పొంది బయటకు వస్తూ ఆస్పత్రి ఆవరణలోనే పడిపోయి మృతి చెందాడు. అతనికి అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. అయితే అతని మృతి పై వైద్యులు అనుమానం వ్యక్తం చేసి ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు టూ టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ..

దీపావళి పండుగ రోజు ఏలూరులో సంభవించిన ఉల్లిపాయ బాంబ్‌ల విస్ఫోటనం ఘటనకు సంబంధించి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తూర్పువీధికి చెందిన మల్లా పెద్దిరాజు (65) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. పెద్దిరాజు కూలి పనులు చేస్తుంటారు. గత నెల 31న దీపావళి పండుగ నేపథ్యంలో విస్ఫోటనం జరిగిన సమయంలో అక్కడ దగ్గరగా ఉండడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర గాయాలపాలై ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దిరాజు మృతి చెందాడు.

రైలు ఢీకొని..

రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూట్‌మిల్ రైల్వే ఫ్లైఓవర్ కింద శనివారం సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయసున్న ఓ వ్యక్తి రైలుపట్టాలు దాటుతుండగా అదే సమయంలో వచ్చిన రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి మృతదేహాన్ని సర్వజన ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు కాషాయరంగు పొడుగు చేతుల చొక్కా, నీలం రంగు ప్యాంటు, పసుపు రంగు పొట్టి చేతుల టీసర్టు ధరించి ఉన్నాడు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వాళ్ళు 99892 19559 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

భార్యను బెదిరించాలని..

జంగారెడ్డిగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పురుగు మందుతాగి వ్యక్తి మృతి చెందిన ఘటన వేగవరంలో జరిగింది. మృతుడి అన్న మీసాల సూరిబాబు ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఉమామహేశ్వరరావు తెలిపారు. వేగవరంనకు చెందిన మీసాల రమణ (38) కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్నాడు. డాక్టరు మద్యం తాగ వద్దని చెప్పినా వినకపోవడంతో భార్య అడ్డుకుంది. దీంతో ఆమెను బెదిరించాలని ఈ నెల ఒకటో తేదీన మద్యంలో గడ్డి మందు కలుపుకుని తాగాడు. ఈ విషయం తన అన్న సూరిబాబుకు చెప్పగా వెంటనే ప్రయివేటు అంబులెన్సులో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

వరించిన అదృష్టం

ఉమ్మడి పశ్చిమలో నలుగురికి నామినేటెడ్ పదవులు

ప్రభుత్వ సలహాదారుగా షరీఫ్

కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా కొత్తపల్లి సుబ్బారాయుడు

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా కనకరాజు సూరి

ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడు

తొలి విడతలో నాలుగు.. తాజాగా నాలుగు పదవులు

(భీమవరం/నరసాపురం/ఏలూరు రూరల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు అమిత ప్రాధాన్యం ఇచ్చింది. రెండో విడత విడుదల చేసిన పదవుల్లో మూడు కీలక పదవులను కేటాయించింది. సీనియారిటీ, విధేయతకు పెద్దపీట వేసింది. జిల్లాకు మూడు పదవులు కట్టబెట్టింది. శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, కనకరాజు సూరిలకు కీలక పదవులు వరించాయి. తెలుగుదేశం ఇన్‌చార్జిలకు ఎటువంటి పదవులు ఇవ్వలేదు. ప్రభుత్వం వ్యూహాత్మకంగానే ఇన్‌చార్జిలకు పదవులు ఇవ్వలేదన్న అభిప్రాయం ఉంది. ఇన్‌చార్జిలకు ఇతర పదవులు ఇవ్వాలన్న తలంపుతో ఉంది. ఇప్పటికే అధిష్ఠానం వద్ద కొందరు ఇన్‌చార్జిలు తమ మనోగతాన్ని వెల్లడించారు. అందులో భాగంగానే రెండో విడత నామినేటెడ్ పదవులు కేటాయించలేదు. జిల్లాలో తొలి వరుసలో తెలుగుదేశం ఇన్‌చార్జిలు తోట సీతారామలక్ష్మి, వలవల బాబ్జి, పొత్తూరి రామరాజులున్నారు. తొలి నుంచీ టిక్కెట్ భరోసా ఇచ్చి ఇవ్వలేకపోయామంటూ బాబ్జిపై అధిష్ఠానం ఇప్పటికే మల్లగుల్లాలు పడుతోంది. అలాగే తోట సీతారామలక్ష్మి విషయంలో ఇప్పటికే పార్టీలో కీలకమైన పొలిట్‌బ్యూరో బాధ్యతలు అప్పగించింది. ఇక నర్సాపురం ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుకు పదవి ఇచ్చేలా కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. రెండో విడత నామినేటెడ్ పదవుల కేటాయింపులో తెలుగుదేశం, జనసేనకు బెర్త్‌లు వరించాయి. మైనారిటీ వ్యవహారాల విభాగంలో ప్రభుత్వ సలహాదారుగా శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్‌ను నియమించింది. తొలి నుంచీ తెలుగుదేశం పార్టీకి షరీఫ్ విధేయతగా ఉంటున్నారు. 1982 టీడీపీ జెండాను నరసాపురంలో ఎగర వేసినవారిలో షరీఫ్ ఒకరు. లా చదివి, టీడీపీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. అప్పటి నుంచి పార్టీలో కొనసాగుతూ పార్టీలో అనేక పదవులు నిర్వహించారు. పార్టీ ఒడిదుకుల్లోనూ అంటిపెట్టుకుని ఉన్నారు. వివాద రహితునిగా, పార్టీ విధేయునిగా షరీఫ్‌కు మంచి పేరుంది. విధేయత చూపిన వారికి పెద్దపీట వేస్తామన్న సంకేతాలను తెలుగుదేశం అధిష్ఠానం కేడర్‌కు పంపింది. ఇదివరకే ఉండి మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు రామరాజుకు ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమించారు. టిక్కెట్ వదులుకున్న రామరాజుకు ఇప్పటికే తెలుగుదేశం పెద్దపీట వేసింది. మాజీ మంత్రి పీతల సుజాతకు రాష్ట్ర వినియోగదారుల రక్షణ కౌన్సిల్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. పోలవరం నేత బొరగం శ్రీనివాస్‌కు ఏపీ ట్రైకార్ చైర్మన్ పదవి ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెండో విడతలో జనసేనలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా కనకరాజు సూరికి పదవి వరించింది.

గతంలో ఆయన ప్రజారాజ్యం తరఫున భీమవరం నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. అప్పట్లో పవన్ కల్యాణ్ ఆశీస్సులతోనే భీమవరం టిక్కెట్ దక్కించుకున్నారు. ఓటమి తర్వాత ఆయన ఏ పార్టీకి చేరువకాలేదు. పవన్ కల్యాణ్‌తో సన్నిహితంగా ఉంటూ వస్తున్నారు. జనసేన పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కనకరాజు సూరికి ప్రత్యేకంగా భరోసా ఇచ్చారు. ఇప్పుడు మాట నిలబెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలను అప్పగించారు.

కూటమిలో రెండో సారి

కాపు కార్పొరేషన్ పదవి రెండో సారి జిల్లాకు వరించింది. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో తొలిసారి కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన మొదటి చైర్మన్‌గా కొత్తపల్లి సుబ్బారాయుడు నియమితులయ్యారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకే రెండో సారి కాపు కార్పొరేషన్ పదవి వరించింది. జనసేనలో కొత్తపల్లి చేరినప్పుడే పవన్ కల్యాణ్ నుంచి హామీ లభించింది. అందుకు తగ్గట్టుగానే కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలను కూటమి పంపకాల్లో కొత్తపల్లి సుబ్బారాయుడుకు కేటాయించారు. రుస్తుంబాదా ప్రాంతానికి చెందిన ప్రాంతానికి 1983లో స్వతంత్ర అభ్యర్థిగా మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి నుంచి రాజకీయ ప్రస్థానం మొదలైంది.

పదవులు ఆశించే వారెందరో

ఇంకా జిల్లాలో ప్రధాన పదవులను ఆశించే నాయకులు ఉన్నారు. ఆ వరుసలో భీమవరం నుంచి మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావు, తణుకు నుంచి దొమ్మేటి సుధాకర్, నర్సాపురం నుంచి మాధవ నాయుడు వంటి నాయకులకు తెలుగుదేశం కూటమి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. నాయకులు ఇప్పటికే అధిష్ఠానం వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పదవికి వన్నెతెస్తా: రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు రూరల్: సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనకు అప్పగించిన పదవికి వన్నెతెస్తానని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్‌గా ఎంపికైన ఏలూరు జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిఅప్పల నాయుడు అన్నారు. ఏలూరు మార్కెట్ యార్డులో హమాలీగా చేరి ఆ తర్వాత ఏలూరు వెంకటాపురం సర్పంచ్‌గా గెలుపొంది రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2019లో జనసేనపార్టీ నుంచి ఏలూరు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2024లో ఏలూరు ఎమ్మెల్యే సీటు ఆశించారు. కూటమిలో భాగంగా బడేటి చంటికి టికెట్ కేటాయించారు. అప్పట్లో రెడ్డిఅప్పలనాయుడు కొంత అసంతృప్తిని వ్యక్తం చేశారు. అప్పట్లో పార్టీ అధిష్ఠానం అప్పలనాయుడుకు భవిష్యత్‌లో ఉన్నత పదవులు ఇస్తామని ఇచ్చిన హామీలో భాగంగానే ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్‌గా నియమించారు.

పాలకొల్లు టీడీపీ శ్రేణుల్లో నిరాశ

పాలకొల్లు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల 2వ జాబితాను విడుదల చేసిన నేపథ్యంలో 59 మందికి రాష్ట్ర వ్యాప్తంగా పదవులు లభించినప్పటికీ పాలకొల్లు నియోజక వర్గానికి ఒక్క పదవి రాకపోవడం పట్ల టీడీపీ శ్రేణు లు నిరాశగా ఉన్నాయి. టీడీపీ హయాంలో గత 40 ఏళ్ళుగా పాలకొల్లు నియోజక వర్గంలో పార్టీకి వెన్నంటి ఉన్న వారు ఎందరో ఉన్నారు. నామినేటెడ్ పోస్టుల తొలి జాబితాలోనూ, మలి జాబితా లోనూ పాలకొల్లు నియోజక వర్గానికి చోటు లభించకపోవడంతో నామినేటెడ్ పదవు లు ఆశించిన నాయకులు డీలా పడ్డారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌కు మాత్రం రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు తప్ప మరొకరికి కనీసం నామినే టెడ్ పదవీ కూడా టీడీపీ అధిష్ఠానం ఇవ్వకపోవడం సముచితంగా లేదని సీనియర్ నాయకులు పెదవి విరుస్తున్నారు.

ఘనంగా న్యాయసేవాధికార సంస్థ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి సి.పురుషోత్తమ కుమార్ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ 9వ తేదీ నుంచి నేటి వరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలను జిల్లా న్యాయసేవా ధికార సంస్థలు చేపట్టాయని అన్నారు. లోక్ అదాలత్‌లు నిర్వహించడం, చట్టాలపై ప్రజలకు అవగాహన, ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గత ఏడాది కాలంలో 7670 కేసులను రాజీ చేయడం జరిగిందని తెలిపారు. 155 మందికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేశామని, 716 న్యాయ విజ్ఞాన సదస్సులు, నిర్వహించామన్నారు. రెండవ అదనపు జిల్లా జడ్జి పి మంగాకుమారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లారీ కింద పడి విద్యార్థిని మృతి



పల్లవి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్) పల్లవి (ఫైల్)

కైకలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను కోల్పోయిన ఆమె బాబాయి దగ్గర పెరుగుతూ 9వ తరగతి చదువుతోంది. అయితే విధి చిన్నచూపు చూడడంతో ప్రమాద వశాత్తూ లారీ కింద పడి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కైకలూరులోని కోరుకొల్లు రోడ్డులో తల్లిబోయిన దుర్గారావు నివసిస్తుండగా అతని సోదరుడు వెంకన్న, వదిన మణి అనారోగ్యంతో సుమారు పదేళ్ల క్రితం మృతి చెందారు. దీంతో వారి కుమార్తె పల్లవి (16)ని దుర్గారావు దంపతులు పెంచుకుంటున్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. దుర్గారావు స్థానిక ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తుంటాడు. పల్లవికి తల్లిదండ్రులు లేరన్న బాధ లేకుండా ఆమెను తమ సొంత కూతురులా అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. పల్లవి కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువు తోంది. ఆమె స్థానిక టౌన్‌హాలు సమీపాన ఉన్న ట్యూషన్ సెంటర్‌కు ప్రతీ రోజూ వెళ్లి వస్తుంది. శనివారం సాయంత్రం ట్యూషన్ నుంచి ఇంటికి సైకిల్‌పై తిరిగి వెళ్తూ కుమారి థియేటర్ వద్ద ప్రమాదవశాత్తూ లారీ కింద పడి మృతి చెందింది. ఈ విషయం తెలుసు కున్న ఆమె బాబాయి, పిన్ని ఇతర కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహం వద్ద బోరున విలపించారు. 'అన్న కూతురిని సొంత కూతురిలా పెంచుకుంటు న్నాం.. దేవు డు మాకు అన్యాయం చేశాడు' అంటూ రోదించడం చూపరులను కలిచివేసింది. టౌన్ ఎస్‌ఐ వెంకట్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

» ముదినేపల్లి మండలంలో తొమ్మిది మిల్లులకు అనుమతి



అమ్మకానికి సిద్ధమైన ధాన్యం బస్తాలు

ముదినేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సార్వా ధాన్యం కొనుగోలుకు మండలంలో పౌర సరఫరాల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. అన్ని ప్రభుత్వ రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయడమే కాక, కొరత లేకుండా గోనె సంచుల సరఫరాకు, గత సార్వా సీజన్‌లో ఏర్పడిన సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో సుమారు 18 వేల ఎకరాల్లో సార్వా వరి సాగు చేయగా, 4 వేల ఎకరాల్లో పూర్తిగా, 2 వేల ఎకరాల్లో పాక్షికంగా వరి పంట దెబ్బతింది. దీంతో సుమారు 13 వేల ఎకరాల్లోని సార్వా ధాన్యాన్ని కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం శాంపిల్స్‌ను చూపించిన అనంతరం రైతు సేవా కేంద్రాల్లో సర్టిఫికెట్లు తీసుకుని రైతులు తమకు నచ్చిన రైసు మిల్లుకు ధాన్యాన్ని అమ్ముకోవచ్చు.

ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేశాం. మండలం లోని తొమ్మిది రైస్ మిల్లులకు ధాన్యం కొనుగోళ్లకు బ్యాంక్ గ్యారంటీలతో అనుమతులు వచ్చాయి. గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. ధాన్యం అమ్మిన 48 గంటల్లో సొమ్మును బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తాం.

- విజయ్, ముదినేపల్లి మండల సివిల్ సప్లయిస్ ఇంచార్జ్

రైతుల ఖాతాల్లోకి ధాన్యం సొమ్ము



చాట్రాయిలో ధాన్యం కాటా వేస్తున్న కూలీలు

చాట్రాయి. నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి సొమ్ములు పడుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం చాట్రాయి, చనుబండ, ఆరుగొలనుపేట రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 378 మెట్రిక్ టన్నులు ధాన్యం మిల్లర్లకు ఎగుమతి చేయగా 24 గంటలు గడవక ముందే ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యాయి. ఏవో శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్మితే మద్దత్తు ధర రావటంతో పాటు సొమ్ములు కూడా వెంటనే చెల్లించటం జరుగుతుందని, రైతులు దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన తరువాత నెలల తరబడి డబ్బులు రాకపోవటంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యారని చనుబండ ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ విలేజ్ కమిటీ మెంబరు జక్కంపూడి ప్రదీప్ కుమార్ అన్నారు.

24న మాలల ఆత్మగౌరవ సభ

నూజివీడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాల యోధుల సంక్షేమ సంఘం కోర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 24న నూజివీడులో మాలల ఆత్మగౌరవ సభ జరగనుంది. ఈ సభ వాల్‌పోస్టర్‌ను శనివారం నూజివీడులో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముని మనుమడు రాజారత్న అంబేడ్కర్ పాల్గొన్నారు. మాలసంఘాల జేఏసీ జాతీయ చైర్మన్ యాడీవీ ప్రసాద్, మహాసేన వ్యవస్థాపకులు ఎస్.రాజేష్, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వెంకట్రావు, రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు బి.శరత్ తదితరులు అతిథులుగా పాల్గొంటున్నారని కోర్ కమిటీ సభ్యులు తెలిపారు.

తల్లి పేరున మొక్క నాటండి

నూజివీడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన ఏక్‌పెడ్ మాకేనామ్ అంటూ తల్లి పేరు మీద ఒక మొక్క కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఏలూరు ఆధ్వర్యంలో శనివారం నూజివీడులోని సారథి ఇంజినీరింగ్ కాలేజిలో ఏలూరు జిల్లా యూత్ ఆఫీసర్ డి.కిషోర్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ పాల్గొని కాలేజ్ విద్యార్థులకు పర్యావరణం మీద అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద ఒక మొక్కనాటాలన్నారు. నూజివీడు రూరల్ ఏఎస్సై శ్రీనివాస్, నూజివీడు సచివాలయ సిబ్బంది, సారథి ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీధర్, ఏవో రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ తీర్పు సుప్రీం తీర్పుతో సమానం

నూజివీడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో ఇచ్చే తీర్పులు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని నూజివీడు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి తెలిపారు. నూజివీడులోని సిద్ధార్థ కళాశాల ఆవరణలో శనివారం నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ, న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సివిల్ జడ్జి శివపార్వతి మాట్లాడుతూ పేదలు ఉచితంగా న్యాయ సలహా పొంద వచ్చన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.సత్యప్రకాష్ అధ్యక్షత వహించగా, న్యాయవాదులు, పలు చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి మధురవిశంకర్, సీనియర్ న్యాయవాదులు, సిద్ధార్థ సంస్థల అధిపతి జి.రవిబాబు, లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ లోపం.. ఫంగస్ చేపలు మృత్యువాత



కలిదిండి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొండంగి గ్రామానికి చెందిన ఒక రైతు సుమారు ఐదు ఎకరాల చెరువులో ఫంగస్ చేపలు పెంపకం చేపట్టాడు.. పట్టుబడి దశకు వచ్చాయి. వారం రోజుల్లో ఫంగస్ చేపలను పట్టుబడి చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. శుక్రవారం రాత్రి ఆకస్మాత్తుగా చెరువుల్లో ఆక్సిజన్ లోపించడంతో రూ.14 లక్షల విలువ గల ఫంగస్ చేపలు మృత్యువాత పడ్డాయి. చనిపోయిన చేపలు నీటిపై తెప్పలుగా తేలాడుతున్నాయి. చేతికి వచ్చిన చేపలు మృత్యువాత పడడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని, మత్స్యశాఖాధికారులు బీమా సౌకర్యం కల్పించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బాధితునికి సాయం

ఆగిరిపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో సర్వసం కోల్పోయిన ఆగిరిపల్లి దళితవాడలో నివాసముంటున్న గొల్లపల్లి విజయ్‌కుమార్‌కు దాతలు చేయుత నందించారు. పీఎస్‌వీ ప్రసాద్, వీఆర్వోలు, సర్పంచ్ లక్ష్మివిక్టర్ విజయ్‌కుమార్‌కు రూ.5 వేల నగదు, రైస్ బ్యాగ్ వంట సామగ్రి అందచేశారు. ఇదే క్రమంలో భాగ్యలక్ష్మి ఇండియన్ గ్యాస్ యజమాని పాలడుగు శ్రీనివాస్ బాధితునికి దుప్పట్లు, వంట సామగ్రి, రైస్ బ్యాగ్ సాయం చేశారు.

వంద శాతం అక్షరాస్యత సాధిస్తాం

ఆగిరిపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నూరు శాతం అక్షరాస్యత సాధించాలని మహిళలకు ఆర్థిక, డిజిటల్, క్రియాత్మక అక్షరాస్యత నేర్పుతామని, 100 రోజుల శిక్షణ పూర్తి అయిన తరువాత పరీక్షలు నిర్వహించి వారికి సర్టిఫికెట్లు ఇస్తామని ఎంపీడీవో భార్గవి తెలిపారు. ఆగిరిపల్లి వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాస్యత వయోజన విద్య ప్రోగ్రాంపై మండల స్థాయిలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏపీఎం డి.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంపీడీవో బి.భార్గవి ప్రారంభించారు. అనంతరం శిక్షణ సమగ్రిని అందజేశారు. ఏపీఎం రాజశేఖర్ మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలంలో 19 పంచాయతీల్లో 27 కేంద్రాల ద్వారా ఒక్కొక్క సెంటర్లో ఒక్కొక్క టీచర్‌కి పది మంది లెర్నర్స్ చొప్పున ఎర్రర్స్‌ను డీఆర్‌డీఏ వెలుగు మండల సమైక్య ద్వారా గుర్తించటం జరుగుతుందని తెలిపారు. వారికి 27 మంది ట్రైనర్స్ ద్వారా మార్చి 2025 వరకు చదువు చెప్పించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నిరక్షరాస్యులు అందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంఈవో -2 ఆనంద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్ళవలసిన బాధ్యత వలంటరీ, టీచర్స్‌దే అని అన్నారు. ఈ కార్యక్రమానికి వలంటరీ టీచర్స్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

హైవే పనుల్లో పగిలిన పైప్‌లైన్

» మండవల్లిలో నిలిచిన నీటి సరఫరా

» మరమ్మతులకు చొరవ చూపని అధికారులు



మండవల్లిలో నీటి సరఫరా నిలిచిపోవడంతో ట్యాంకర్లలో నీరు పట్టుకుంటున్న దృశ్యం

మండవల్లి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే విస్తరణలో మంచినీరు పైపులైన్లు పగిలి నీటి సరఫరా నిలిచిపోవడంతో రెండు రోజులుగా మండవల్లిలో హైవే రోడ్డు వెంబడి నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా డ్రెయినేజీ పైపులైన్ పనులను ఎక్స్‌వేటర్లతో చేపట్టగా పాత పైపులైన్ పగిలిపోయింది. పైపులైన్ మరమ్మతులు చేసేందుకు హైవే అధికారులు, పంచాయతీ అధికారులు ఒకరిపై ఒకరు వంతులు వేసుకుంటున్నారు. ప్రత్యామ్నాయంగా బావులు బోర్లు వంటివి లేకపోవడంతో తాగునీటి కోసం గ్రామస్థులు మినీ వాటర్ ప్లాంట్‌పై ఆధారపడుతున్నారు. కొందరు ట్యాంకర్ల ద్వారా, మరికొందరు రిక్షాలపైన, ఆటోలపైన నీటి క్యాన్లతో దర్శనమిచ్చారు. పగిలిన మంచినీటి పైపులైన్ మరమ్మతులు తక్షణమే చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ముసునూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఎం అధ్వర్యం చేపట్టిన ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు పిలుపునిచ్చారు. ముసునూరులో యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు విపరీతంగా పెంచుతున్నాయన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించే విధంగా చట్టం తీసుకువచ్చి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక ప్రజా సమస్యలపై ఈ 14వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రాజు కోరారు. నాయకులు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ గంగా శ్రీదేవి

ముదినేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం- చేవూరు పాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వచ్చేనెల 7 నుంచి ప్రారంభం కానున్న షష్ఠి కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి కోరారు. దేవ స్థానంలో శనివారం ఆమె శ్రీహరిపురం, సింగరాయపాలెం, చేవూరుపాలెం గ్రామస్థులతో సమావేశం నిర్వహించి ఉత్సవ ఏర్పాట్లపై సలహాలు తీసుకున్నారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, దేవస్థానం మాజీ చైర్మన్ పసుపులేటి నరసింహారావు, మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు పరసా సత్యనారాయణ, లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కానుబోయిన నాంచారయ్య, రంగిరెడ్డి గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని ఆందోళన



సింహాద్రిపురం వద్ద రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు, స్థానికులు

ముసునూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూ రు వెళ్లే ప్రధాన రహదారి నిర్మించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. సింహాద్రిపురం వద్ద సీపీఐ నాయకులు, స్థానికులు రోడ్డును దిగ్బంధం చేసి రాస్తారోకో చేశారు. చలసాని మాట్లాడుతూ ఈ ప్రధాన రహదారి డబల్‌గా విస్తరణ చేసేందుకు నిధులు మంజూరై నాలుగున్నర సంవత్సరాలు గడిచినప్పటికి నేటికి పనులు చేపట్టకపోవడం పాలకులు, అధికారుల అసమర్థతకు నిదర్శనమ న్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల ఈ రహదారి మరింత అధ్వానంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు మాసాలు గడిచినప్పటికి ఈ రోడ్డు గురించి పట్టించుకోకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఈ రోడ్డు నిర్మాణం 15 రోజుల్లోపు చేపట్టకపోతే ఈ రహదారిపైనే 24 గంటలు రాస్తారోకో చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, జిల్లా రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ పాల్గొన్నారు.

అభయ యాప్ సద్వినియోగం చేసుకోండి

నూజివీడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మహిళా రక్షణ కోసం అభయా యాప్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఈ యాప్‌ను ఈ నెల 6న జిల్లా ఎస్పీ ప్రతాప్ కిశోర్‌బాబు ఆవిష్కరించారన్నారు. సమస్యలను టోల్ ఫ్రీ, వాట్సాప్ నెంబర్లు 95503 51100 నెంబర్‌కు వివరించవచ్చన్నారు.



ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఎంఎల్‌సీ పట్టభద్రుల ఓటర్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న వీఆర్వోలు

పట్టభద్రుల ఓటర్ల దరఖాస్తుల పరిశీలన

ముదినేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు ముదినేపల్లి మండలంలో సుమారు 1,700 మంది పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని తహసీల్దార్ ఎస్‌కె.సుభానీ ఆధ్వర్యంలో వీఆర్వోలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పరిశీలన అనంతరం ఈ నెల 20న అర్హత కలిగిన ఓటర్ల జాబితాలను ప్రకటిస్తామని తహసీల్దార్ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ముదినేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లినే మీగడపురానికి చెందిన హరి అనే యువకుడిపై కిడ్నాప్, పోక్సో కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు. ఆ బాలిక తండ్రి శుక్రవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

బాల్య వివాహాలపై అవగహన

ముసునూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చింతలవల్లిలో కిషోర బాలికలకు బాల్య వివాహాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం అవగహన కల్పించారు. బాలికలు 18 ఏళ్ల లోపు వివాహం చేసుకోవడం వల్ల అనేక నష్టాలు ఉన్నాయని అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజకుమారి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముసునూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): లైన్ల మరమ్మతలు నిమిత్తంమండలంలోని అక్కిరెడ్డిగూడెం, రమణక్క పేట, సూరేపల్లి గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ కేవీ సుబ్బారావు శనివారం తెలిపారు.

మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన



మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన చేస్తున్న చిన్నతాడినాడ గ్రామస్థులు

కైకలూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు వద్ద చిన్నతాడినాడ వెళ్లే రహదారిలో మద్యం దుకాణం ఏర్పాటును చిన్నతాడినాడ గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామానికి ప్రధాన రహదారని నిత్యం ఇటుగా ప్రజలు రాకపోకలు సాగిస్తారన్నారు. మద్యం దుకాణం వల్ల ఇబ్బందులకు గురవుతామని ఆందోళన చేశారు. అయితే మద్యం దుకాణం ఏర్పాటు చేసేది ఆలపాడు పంచాయతీ పరిధిలోనికి వస్తుందని ఆ గ్రామానికి సంబంధం లేదని అయినా అడ్డుకోవడం తగదంటూ దుకాణాదారులు, ఆలపాడు గ్రామస్థులు పేర్కొన్నారు. కైకలూరు ఎక్సైజ్ సీఐ షేక్ రమేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో చర్చించారు. ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఐ వారికి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

కౌలురైతు ఆత్మహత్య

ముసునూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో కౌలురైతు కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేశారు. గోగులంపాడుకు చెందిన చెన్ను రాజారావు (38) నాలుగేళ్లుగా సుమారు ఏడేకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఏటా కౌలు వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పులపాలై తీర్చేదారిలేక కొన్ని నెలలుగా మనోవేదనకు గురైవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం సమయంలో ఎక్కువ మద్యం సేవించి, పొలానికి వెళ్ళిన రాజారావు మద్యం మత్తులో కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. రాజారావును చికిత్స నిమిత్తం నూజివీడు అమెరికన్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రువారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్యా, కుమార్తె ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

కలిదిండి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొండంగి పల్లిపాలెంలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఒక మహిళ (48)ను అరెస్టు చేసి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. బెల్టుషాపులు ఏర్పాటు చేసి అనధికారికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.